WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091

Facebook.varadhinews

# వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి:1
సంచిక:21
మంగళవారం,
24.09.2024

# పార్టీ మారిన ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు..!

## కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు



- అనర్హులుగా ప్రకటించాలంటూ కేఏ పాల్ పిటిషన్
- జీతాలు, అలవెన్సులు కట్ చేయాలని రిక్వెస్ట్
- 4 వారాలకు విచారణ వాయిదా
- నేతలు పశువుల్లా అమ్ముడుపోతున్నారు
- ఎమ్మెల్యేలు పార్టీ మారితే ఈసీ ఏం చేస్తోంది
- నా పిటిషన్‌పై హైకోర్టు సీరియస్ యాక్షన్ తీసుకుంటుంది
- మీడియా ఎదుట కేఏ పాల్ ఆగ్రహం

### సంతలో పశువుల్లా అమ్ముడుపోతున్నారు

బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడం చట్ట విరుద్ధమని కేఏ పాల్ అన్నారు. కోర్టు ఆదేశాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తన పిటిషన్‌ను హైకోర్టు చాలా సీరియస్‌గా తీసుకుందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ఈసీ ఎందుకు చర్యలు తీసుకోలేదని కేఏ పాల్ ప్రశ్నించారు. దేశం సర్వనాశనం కావడానికి పొలిటికల్ కరప్షనే కారణమన్నారు. చైనా, అమెరికాలో పొలిటికల్ కరప్షన్ లేదని.. అందుకే ఆ దేశాలు అభివృద్ధి చెందాయని కేఏ పాల్ తెలిపారు. పశువులు సంతలో అమ్ముడిపోయినట్లు.. నేతలు డబ్బులు, పదవులకు అమ్ముడుపోతున్నారని పాల్ విమర్శించారు. దీన్ని ఎవరూ ఖండించకపోవడం దారుణమన్నారు.

**వారధి, స్టేట్ బ్యూరో:**

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు పడనుందా..? అంటే అవుననే సమాధానం వస్తోంది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల విషయంలో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద గౌడ్.. దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల హైకోర్టు కీలక తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. అసెంబ్లీ స్పీకర్‌కు కీలక ఆదేశాలిచ్చింది. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్ కార్యాలయానికి ఆదేశాలు జారీ చేసింది. అప్పటికీ కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే.. సుమోటోగా కేసు విచారిస్తామని తెలిపింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో పాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలంటూ పిటిషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును కోరారు. ఈ మేరకు హైకోర్టు కీలక ఆదేశాలివ్వటంతో.. ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోనున్నాయన్నది ఉత్కంఠగా మారింది. కాగా.. ఇప్పుడు కేఏ పాల్ కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో జంప్ అయిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ పిటిషన్ వేయటం.. వారికి హైకోర్టు నోటీసులు జారీ చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

**వారికి జీతాలు ఇవ్వొద్దన్న పాల్..**

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వేసిన పిటిషన్.. 10 మంది తెలంగాణ ఎమ్మెల్యేలకు ఏకంగా హైకోర్టే నోటీసులు జారీ చేసేలా చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున గెలిచి.. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కేఏ పాల్.. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జరీ చేసిన ధర్మాసనం.. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఒక పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన తర్వాత.. మరో పార్టీలోకి మారటమనేది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని కేఏ పాల్ అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాంటూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కేఏ పాల్ కోరారు. ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ టికెట్ మీద విజయం సాధించిన ఎమ్మెల్యే దానం నాగేందర్.. ఆరు నెలల తిరగకముందే పార్టీ మారటమే కాకుండా.. ఆ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసినట్టుగా పిటిషన్‌లో కేఏ పాల్ పేర్కొన్నారు. తాను పోటీ చేసి గెలిచిన పార్టీకి రాజీనామా చేయకుండానే.. వేరే పార్టీలో చేరి అధికారాలను అనుభవిస్తున్నారని.. అది తప్పు అని అభిప్రాయపడ్డారు. ఇది చట్టాన్ని, రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే అవుతుందని కేఏ పాల్ పేర్కొన్నారు. అలాగే పార్టీ మారిన ఎమ్మెల్యేలకు జీతాలు, అలవెన్సులు కట్ చేయాలని కేఏ పాల్ తన పిటిషన్‌లో కోరారు.



# చాప కింద నీరులా మంకీపాక్స్

- భారత్‌లో డెడ్లీ మంకీపాక్స్ మరో కేసు నమోదు
- గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీకి కారణమిదే
- దుబాయ్ నుంచి కేరళ వచ్చిన వ్యక్తికి పాజిటివ్:కేంద్ర ఆరోగ్య శాఖ అలర్ట్

**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**

ప్రాణాంతక మంకీపాక్స్‌కు సంబంధించి భారత్‌లో మరో కేసు నమోదైనట్లు సమాచారం. హెల్త్ ఎమర్జెన్సీకి దారితీసిన 'క్లేడ్ 1బీ' స్ట్రెయిన్‌గా దీన్ని గుర్తించారు. కేరళకు చెందిన యువకుడిలో గతవారం ఈ వ్యాధి నిర్ధరణ అయినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కేరళలోని మలప్పురానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తి దుబాయ్ నుంచి ఇటీవల ఇండియాకు వచ్చాడు. అతడిలో ఎంపాక్స్ లక్షణాలు కనిపించాయి. దీంతో వైద్య పరీక్షలు నిర్వహించగా క్లేడ్ 1గా నిర్ధరణ అయ్యింది. ప్రపంచ 'హెల్త్ ఎమర్జెన్సీ'కి

2 లో

# యూట్యూబ్ చానళ్లకూ అక్రిడేషన్లు..?



- కేంద్ర నిబంధనలు పాటించిన వారికే
- విధివిధానాలపై ప్రెస్ అకాడమీ రౌండ్ టేబుల్ మీటింగ్
- యూట్యూబ్ చానళ్లు నైతిక ప్రమాణాలు పాటించాలి
- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

2 లో



# కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేకి

- రిజర్వేషన్లను రక్షించగల ఏకైక వ్యక్తి మోదీనే
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

2 లో



# కాంగ్రెస్‌ది గుండా రాజ్యం

- తెలంగాణను మరో బీహార్‌గా మార్చే కుట్ర
- రాయలసీమ ఫ్యాక్షన్‌లా రేవంత్ పాలన
- ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటిపై దాడి దారుణం
- దాడికి పాల్పడ్డ వారిని అరెస్ట్ చేయాలి
- మాజీ మంత్రి హరీష్‌రావు

**వారధి న్యూస్, మెదక్:**

తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తూ.. రాష్ట్రాన్ని మరో బీహార్‌గా మార్చేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తోందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో గుండారాజ్యం నడుస్తోందని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం (సెప్టెంబర్ 23) నర్సాపూర్

2 లో

# కోర్టులపై రేవంత్‌కు ఎందుకంత అపనమ్మకం

## పేదోళ్ల ఇండ్లు కూలగొట్టే దుర్మార్గపు ప్రభుత్వం ఇది

- ఇలా ఎక్కువ కాలం తప్పించుకోలేరు
- పేదలపైనేనా మీ ప్రతాపం
- పెద్దల జోలికెందుకు వెళ్లరు..?
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం
- కూకట్‌పల్లి కూల్చివేతల ప్రాంతంలో పర్యటన



**వారధి, స్టేట్ బ్యూరో:**

సీఎం రేవంత్ రెడ్డికి కోర్టులపై ఎందుకు అపనమ్మకమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. అందుకే శనివారం, ఆదివారం చూసుకొని హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొడుతున్నారని మండిపడ్డారు. కూకట్ పల్లిలోని నల్లచెరువు పరిసరాల్లో గల హైడ్రా కూల్చివేతలను సోమవారం ఆయన పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నల్లచెరువు రికార్డ్స్ ప్రకారం 19 ఎకరాలు కాగా, మధ్యలో సర్వే చేసి 27 ఎకరాలను అని నిర్ధారించి రికార్డుల్లో చేర్చారని తెలిపారు. చెరువు భూముల్లో 7.36 ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూమి కాగా మిగతా

2 లో

# రేషన్ కార్డు లేని రైతులకూ రుణమాఫీ..

- త్వరలో వర్తింపజేస్తాం
- పంటల బీమా పథకం కూడా అమలుచేస్తాం
- మంత్రి తుమ్మల కీలక ప్రకటన



**వారధి న్యూస్, ఖమ్మం:**

దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా రూ.31 వేల కోట్ల రుణమాఫీ కాలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. త్వరలో తెల్లరేషన్ కార్డులు లేని వారికి కూడా రుణమాఫీ వర్తింపజేస్తామని

2 లో

# రేవంత్ సోదరుడికి బిగ్ రిలీఫ్






- దుర్గం చెరువు కూల్చివేతలపై హైకోర్టు స్టే
- ఎఫ్‌టీఎల్ పరిధిలో తప్పులున్నాయన్న బాధితులు
- లేక్ ప్రొటెక్షన్ కమిటీకి కోర్టు కీలక ఆదేశాలు

2 లో



# సీతక్క నేను మీ ఫ్యాన్!

- మంత్రి సీతక్కతో నమ్రత ఫొటో
- సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న ప్రశంసలు

**వారధి న్యూస్, హైదరాబాద్:**

వరద బాధితుల సహాయార్థం టాలీవుడ్ సూపర్ స్టార్, నటుడు మహేష్ బాబు తెలంగాణ సీఎం సహాయనిధికి విరాళం అందించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మహేష్ బాబు దంపతులు సీఎం రేవంత్ రెడ్డిని సోమవారం జూబ్లీ హిల్స్ నివాసంలో కలిసి రూ. 50 లక్షల విరాళం చెక్కును అందజేశారు. ఈ నేపథ్యంలోనే సీఎం ఇంటి వద్ద

2 లో



# బావా బామ్మర్దుల మధ్య విభేదాలు

- మీ గురించి ప్రజలందరికీ తెలుసు
- కేటీఆర్ దమ్ముంటే నిరూపించు
- నేను ఎఫ్‌టీఎల్‌లో ఇల్లు కట్టుకున్నానన్నది అబద్ధం
- సృజన్ రెడ్డి బీఆర్ఎస్ నేత ఉపేందర్ రెడ్డి అల్లుడు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

2 లో



# వన్ స్టేట్, వన్ డిజిటల్ కార్డ్

- రాష్ట్రంలో త్వరలోనే పైలెట్ ప్రాజెక్ట్
- వైద్యారోగ్య శాఖ అధికారులతో సీఎం సమీక్ష
- రేషన్ కార్డుల జారీపై సర్కారు ఫోకస్
- మంత్రివర్గ ఉపసంఘానికి పౌరసరఫరాల శాఖ నివేదిక
- ఆదాయ పరిమితిపై త్వరలో కీలక నిర్ణయం

**వారధి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో కుటుంబ డిజిటల్ కార్డుల జారీకి కార్యచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డిజిటల్ కార్డులపై మంత్రులు దామోదర రాజనర్సింహా, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులతో సీఎం సమక్ష నిర్వహించారు. కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక పట్టణం, ఒక గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి

2 లో

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





# చాప కింద నీరులా మంకీపాక్స్

**మొదటిపేజీ తరువాయి**

దారితీసిన 'క్లేడ్ 1బీ' స్ట్రెయిన్‌గా దీన్ని గుర్తించారు. అయితే, ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 2022లో ప్రపంచ ఆరోగ్య సంస్థ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించినప్పటి నుంచి భారత్‌లో 30కేసులు నమోదయ్యాయి.

**కోలుకున్న 'క్లేడ్ 2' బాధితుడు**

ఇండియాలో సెప్టెంబర్ 9న మొదటి మంకీపాక్స్ కేసు నమోదైంది. ఫారిన్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి నమూనాలు పరీక్షించారు. అది పశ్చిమ ఆఫ్రికాలో వ్యాప్తిలో ఉన్న క్లేడ్ 2 స్ట్రెయిన్‌గా నిర్ధరించారు. కాగా, దాని తీవ్రత తక్కువగా ఉన్నట్లు అప్పుడు వైద్యులు పేర్కొన్నారు. దాదాపు రెండు వారాల పాటు దిల్లీలోని ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో బాధితుడికి చికిత్స అందించారు. అనంతరం అతడిని సెప్టెంబర్ 21న డిశ్చార్జి చేసినట్లు తెలిపారు.

**లక్షణాలుంటే మాకు చెప్పండి : కేరళ ఆరోగ్య శాఖ మంత్రి**

దేశంలో రెండో కేసు నమోదైన నేపథ్యంలో, ఏవైనా లక్షణాలతో విదేశాల నుంచి భారత్‌కు వచ్చే వారు ఆరోగ్య శాఖకు తెలియజేయాలని కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణ జార్జ్ సూచించారు. తద్వారా వీలైనంత త్వరగా చికిత్స పొందాలని విజ్ఞప్తి చేశారు. ఇక, ఈ వ్యాధి సోకిన వారికి రాష్ట్రంలో వివిధ జిల్లాలో చికిత్స, ఐసొలేషన్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ప్రాణాంతక మంకీపాక్స్ డెన్మార్క్‌లో పరిశోధన కోసం తెప్పించిన కోతుల్లో 1958లో మొదటి సారి వెలుగు చూసింది. అనంతరం 1970లో మానవుల్లో గుర్తించారు. 2005లో కాంగోలో వేల సంఖ్యలో ఈ కేసులు నమోదుకాగా 2017 తర్వాత నైజీరియా సహా అనేక దేశాలకు వ్యాపించింది. 2022 నుంచి మళ్లీ విస్తృతంగా వ్యాప్తి చెందుతూ దాదాపు 120 దేశాలకు పాకింది. సుమారు లక్ష కేసులు నిర్ధరణ అయితే తాజాగా కాంగోలో ఆందోళనకర స్థాయిలో ఈ వైరస్ వ్యాపిస్తోంది.

# కోర్టులపై రేవంత్‌కు ఎందుకంత అపనమ్మకం

**మొదటిపేజీ తరువాయి**



మొత్తం పట్టా భూములని, చెరువు నీళ్లు తగ్గినప్పుడు రైతులు ఆ భూములు దున్నుకునే వారని తెలిపారు. ఒకానొక సమయంలో కూకట్‌పల్లిలో రూ.వెయ్యికి ఎకరం భూమి అమ్మే వారని, పన్నులు కట్టలేక కొందరు భూములు వదిలేసుకున్నారని తెలిపారు. తర్వాత భూముల విలువ పెరిగిందన్నారు. నల్ల చెరువు నింపడానికి పైన ఎలాంటి వాగులు లేవని, ఈ చెరువు మత్తడిలోనే ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ నిర్మించి తనే నిబంధనలు ఉల్లంఘించిందన్నారు. శనివారం, ఆదివారం వచ్చిందంటే బుల్డోజర్లు బయటికి వచ్చి పేదల గూడు కూలగొడుతున్నాయని అన్నారు. మిగతా రోజుల్లో కోర్టులు అడ్డుకుంటాయనే బుల్డోజర్లను బయటికి రానివ్వడం లేదన్నారు. కోర్టులు అనాలోచితంగా ఉంటాయా? జడ్జీలు, చట్టాల మీద నమ్మకం లేదా అని ప్రశ్నించారు. జడ్జీలు, కోర్టులు మానవత్వంతో ఆలోచిస్తాయని అన్నారు. పేదల ఇండ్లు కూలగొట్టి, ఆస్తులు ధ్వంసం చేసే దుర్మార్గపు ప్రభుత్వం ఎక్కువ కాలం తప్పించుకోలేదన్నారు.

**సామాన్యుల బతుకుల్లో మట్టికొట్టి ఏం సాధిస్తారు..**

సామాన్యుల బతుకుల్లో మట్టికట్టి, వాళ్ల జీవితాల్లో నిప్పులు పోసి ఏం సాధిస్తావని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి ఏం మానవత్వం ఉంది.. ఇండ్లు కూల్చేస్తున్న వాళ్ల కన్నీళ్లు, శాపనార్థాలు తకకుండా పోవని హెచ్చరించారు. యుద్ధంలో ప్రత్యర్థులను నిర్దయగా చంపినట్టే.. పేదల గూడు ప్రభుత్వం నిర్దయగా కూల్చేస్తుందని అన్నారు. దీన్ని తెలంగాణ సమాజం అస్యహించుకుంటోందన్నారు. పేదల షెడ్లను కూల్చడంతో పాటు అందులోని సామగ్రిని బుల్డోజర్లతో ధ్వంసం చేస్తున్నారని, అంటే ఎంత కక్ష, ద్వేషపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందో అర్థమవుతుందన్నారు. ''తెలంగాణ రేవంత్ తాత జాగీరు లెక్క.. నువ్వే కొత్తగా ముఖ్యమంత్రి అయినట్టుగా.. ఇంతకు ముందు ప్రభుత్వాలు లేనట్టుగా.. ఎకలాజికల్ బ్యాలెన్స్ గురించి నువ్వే పట్టించుకున్నట్టుగా చేస్తున్నావు.. నల్ల చెరువులో జరిగిన దుర్మార్గాన్ని ఖండిస్తున్నాను.. నేను స్థానిక ఎంపీని.. ఈరోజు అధికారం ఉందని, పోలీసులు ఉన్నారని, తాత జాగీర్ లాగా ఏది పడితే అది చేస్తే చెల్లదు బిడ్డ. చరిత్రలో ఇలాంటివారు ఎంతోమంది కాలగర్భంలో కలిసిపోయారు.. ప్రజలు తలుచుకుంటే వారి కన్నీళ్లలో కొట్టుకుపోతావు'' అని హెచ్చరించారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే ఈ హైదరాబాద్‌లో చెరువులు మాయం అవడానికి కారణమెవరో తేల్చాలని డిమాండ్ చేశారు. బతుకమ్మ కుంటను ఎవరు మాయం చేశారు.. చెరువులను పూడ్చి కృష్ణ కాంత్ పార్క్, మాసబ్ ట్యాంక్ క్రికెట్ గ్రౌండ్ చేశారని గుర్తు చేశారు. ప్రసాద్ ఐమ్యాక్స్, ప్యారడైజ్ బిర్యానీ సెంటర్ ఎఫ్‌టీఎల్ లోనే ఉన్నాయని.. వాటి జోలికి పోయే సాహసం చేయని ముఖ్యమంత్రి చిన్నవాళ్ల జోలికి మాత్రమే వస్తున్నారని మండిపడ్డారు.

# కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేకి



**రిజర్వేషన్లను రక్షించగల ఏకైక వ్యక్తి మోదీనే**
**కేంద్ర హోం మంత్రి అమిత్ షా**

**వారధి న్యూస్, హర్యానా:**

కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేకి అని, కుమారి సెల్జా వంటి పలువురు నేతలను అవమానించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత వరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు భారతరత్న ఇవ్వలేదని అన్నారు. తాము ఆయనను గౌరవించేందుకు పంచతీర్థాన్ని స్థాపించామని, సంవిధాన్ దివస్ ప్రకటించామని తెలిపారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తోహాణాలో సోమవారం నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న షా, కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రిజర్వేషన్లపై ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు.

"రాహుల్ బాబా.. మీరేం మాట్లాడుతున్నారు? సిక్కు సమాజాన్ని అగౌరవపరిచిన చరిత్ర మీకు ఉంది. మీ ప్రభుత్వ హయాంలో జరిగిన దిల్లీ అల్లర్లలో వేలాది మంది సిక్కులు రోడ్లపై హత్యకు గురయ్యారు. పిల్లలు, మహిళలను కూడా విడిచిపెట్టలేదు. మీరు ఏదైనా చేయాలనుకుంటే తలపాగా ధరించి గురుద్వారాకు వెళ్లి సిక్కు సోదరులకు క్షమాపణ చెప్పండి. అగ్నివీర్ గురించి రాహుల్ బాబా యువకులను తప్పుదారి పట్టిస్తున్నారు" అని అమిత్ షా ఆరోపించారు. హరియాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని దిల్లీ మధ్యవర్తులు ఎదురుచూస్తున్నారని ఎద్దేవా చేశారు. అందుకే రాష్ట్రాన్ని మధ్యవర్తుల చేతుల్లో పెట్టాలనుకుంటున్నారా అని ప్రజలను ప్రశ్నించారు అమిత్ షా.

# యూట్యూబ్ చానళ్లకూ అక్రిడేషన్లు..?

**వారధి, స్టేట్ బ్యూరో:**




యూట్యూబ్ న్యూస్ చానల్స్ గుర్తింపు అక్రిడిటేషన్ల జారీ, తదితరాలకు, నియమ నిబంధనలు, అనుసరించాల్సిన విధివి ధానాలపై, తెలంగాణ మీడియా అకాడమీ సోమవారం హోటల్ టూరిజం ప్లాజాలో చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రముఖ సంపాదకులు, సీనియర్ జర్నలిస్టులు, యూట్యూబ్ చానెల్స్ నిర్వాహకులు పలు సూచనలు చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో దాదాపు 50 మంది సీనియర్ జర్నలిస్టులు, సంపాదకులు, యూట్యూబ్ ఛానల్ ప్రతినిధులు వాటి వ్యవస్థాపకులు హాజరయ్యారు.

పత్రికలకు ఆర్ఎన్ఐ రిజిస్ట్రేషన్, టీవీ చానల్స్‌కు మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్కాస్టింగ్ గుర్తింపు, కంపెనీ ఆక్ట్ కింద నమోదు కావటం యూట్యూబ్ న్యూస్ చానెల్స్ కి కూడా అవసరమని అభిప్రాయపడ్డారు. న్యూస్ వెబ్సైట్లకి కూడా అలాంటి నియమనిబంధనలే ఉన్నాయన్నది గుర్తు చేశారు. యూట్యూబ్ ఛానల్స్ గుర్తింపుకు అనుసరించాల్సిన అంశాలపై ఈ కార్యక్రమంలో సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ విషయాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అంశాలు అయినందున వాటిని అమలుపర్చాల్సిన కర్తవ్యం యూట్యూబ్ చానెల్స్ పై ఉందని సమావేశం అభిప్రాయబడింది.

**ఇది మొదటి మెట్టు అన్న ప్రెస్ అకాడమీ చైర్మన్**

అకాడమీ ఇలాంటి సమావేశం ఏర్పాటు చేయడం పట్ల సమావేశంలో పాల్గొన్న వాళ్ళందరూ హర్షం వెలిబుచ్చారు. ఇంకా దీనిపై నిర్దిష్ట చర్యలు జరపడానికి మరిన్ని చర్చలు జరపాలని, రౌండ్ టేబుల్ లో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణలో ఇది మొదటిదని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

ఈ అంశం పై ఇంకా లోతైన చర్చ జరగాల్సి ఉందన్నారు. భావస్వేచ్ఛకు ఉన్న పరిమితులకు లోబడి, జర్నలిజం వృత్తికి అనుగుణంగా, ఎప్పటికప్పుడు వార్తలు, చర్చా గోష్ఠిలు, ఇంటర్వ్యూలు, ప్రత్యేక కథనాలు ప్రసారం చేస్తున్న యూట్యూబ్ సంస్థలను మాత్రమే మీడియా సంస్థలుగా గుర్తించవచ్చనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. సబ్ స్క్రైబర్స్, వ్యూస్ ని ప్రధాన క్రైటేరియగా తీసుకోరాదని, ఎందుకంటే అంగట్లో సరుకుల్లాగా వాటి విక్రయం జరుగుతుందని పలువురు అభిప్రాయ పడ్డారు. వ్యక్తిగత ఎజెండాలతో, ద్వేషాలతో, కక్ష్యపూరిత ధోరణులతో, సమాజాన్ని తప్పు ద్రోవ పట్టించే వైఖరితో ప్రసారాలు చేస్తున్న వారిని పరిగణలోకి తీసుకోకపోవడం మంచిదనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. ఎలాంటి చట్టబద్ధత లేకుండా యూట్యూబ్ ప్లాట్ ఫామ్‌లు సృష్టించి, హద్దు అదుపు లేకుండా చెలామణి అవుతున్న వారికి గుర్తింపు ఇవ్వడం ద్వారా మీడియా వ్యవస్థకు మచ్చ కలుగుతుందని, ఇందుకుగాను సంస్థ రిజిస్ట్రేషన్, లేబర్ లైసెన్స్, పోస్టల్ లైసెన్స్, ట్రేడ్ మార్క్ లైసెన్స్, జిఎస్టీ రిజిస్ట్రేషన్, కార్యాలయ నిర్వహణ తీరు, సిబ్బంది తదితర అంశాలను పరిశీలించాలనే అభిప్రాయం వ్యక్తం అయ్యింది. యూట్యూబర్స్ చేస్తున్న ప్రసారాలు జర్నలిజం నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైంది. సియాసత్ మేనేజింగ్ ఎడిటర్, ఎమ్మెల్సీ ఆమెరలి ఖాన్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే. శ్రీనివాస్, ముఖ్యమంత్రి సీపీఆర్ ఓ, అయోధ్య రెడ్డి, మీడియా అకాడమీ పూర్వాధ్యక్షులు అల్లం నారాయణ, ప్రముఖ జర్నలిస్టులు దిలీప్ రెడ్డి, కట్టా శేఖర్ రెడ్డి, పద్మజా షా, ఎం. ఏ. మాజీద్, కరుణాకర్ దేశాయ్, జర్నలిస్ట్ నాయకులు విరహత్ అలీ, సోమయ్య, పలు యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధులు, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్, మీడియా అకాడమీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# బావా బామ్మర్దుల మధ్య విభేదాలు

**వారధి న్యూస్, ఖమ్మం:**



బీఆర్ఎస్‌లో ఉన్న బావా బామ్మర్దుల మధ్య ఉన్న అనుబంధం ఏంటో వారి మధ్య ఉన్న విభేదాలు ఏంటో.. ఇంట్లో వారు ఎప్పుడు ఎక్కడ వెన్నుపోట్లు పొడుచుకుంటారో ప్రజలందరికీ తెలుసని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేను ఎఫ్‌టీఎల్ లో ఇల్లు కట్టుకున్నానని బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు నిరూపించాలని.. బావా బామ్మర్దులు ఇద్దరు టేపు పట్టుకొని వచ్చి నిరూపించండి అంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. సృజన్ రెడ్డి అనే కాంట్రాక్టర్ నామీద పోటీ చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్రెడ్డి సొంత అల్లుడని ఆయనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిదిగా చిత్రీకరించడం కోసం బీఆర్ఎస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. సృజన్ రెడ్డికి గత ప్రభుత్వంలో మీరు కాంటాక్ట్ పనులు ఇచ్చింది నిజం కాదా అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద మీరు చేసిన విమర్శలకి చాలెంజ్ చేస్తే ఆ చాలెంజ్‌లకి సవాల్‌కి కేటీఆర్ సిద్ధం కాలేక పోయారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన కొద్ది పాటి ఓట్లు కూడా బీఆర్ఎస్‌కు రావని విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దించడానికి శ్రీనివాసరెడ్డి పన్నిన పన్నాగమంట.. నీ బుర్ర ఎక్కడ ఉండాల్సిందో.. ఎక్కడుందో ప్రజలు గమనిస్తున్నారు అంటూ కేటీఆర్‌పై మండిపడ్డారు. బావా బామ్మర్దుల మధ్య ఉన్న గ్యాప్ ఏందో ప్రజలందరికీ తెలుస్తూనే ఉంది.. మి మధ్య ఉన్న ఐక్యత ఏమిటో మీ పార్టీ నాయకులకు తెలుసు.. ఎవరు ఎప్పుడు ఎలా వెన్నుపోటు పొడిచుకుంటారో ప్రజలందరికీ తెలుసు.. చూస్తూనే వున్నారు. మా ముఖ్యమంత్రిని మా మంత్రులని మీరు విమర్శించే ముందు మీ పార్టీని చక్కబెట్టుకోవాలని సూచించారు.

**వరద బాధితులకు రెండ్రోజుల్లో రూ.10వేలు**

వరద ప్రభావిత ప్రాంతాల్లోని రైతులకు ఎకరాకు రూ.10 వేలు అందిస్తామని, వీటిని మరో రెండ్రోజుల్లో ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు ప్రజలు అల్లాడిపోయారన్నారు. పంట నీట మునిగి రైతులు నష్టపోయారన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారని గుర్తు చేశారు. రైతులను ఆదుకోవడానికి ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారని, వాటిని త్వరలో ఇస్తామన్నారు.





# రేవంత్ సోదరుడికి బిగ్ రిలీఫ్

**వారధి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరంలో ఆక్రమణలపైకి దూసుకెళ్తున్న బుల్డోజర్లు హడలెత్తిస్తున్నాయి. అక్రమార్కులు గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారు సామాన్యులైనా.. సెలెబ్రిటీలైనా.. రాజకీయ నాయకులైనా.. బడాబాబులైనా.. ఎవ్వరైనా సరే.. నిర్దాక్షిణ్యంగా కట్టడాలను నేలమట్టం చేస్తూ ముందుకెళ్తోంది హైడ్రా. నగరం నలువైపులా హైడ్రా బుల్డోజర్లు వాటి పని అవి చేసుకుంటున్నాయి. అయితే.. హైడ్రా కూల్చివేతలను ఆపేయాలంటూ కొందరు.. తమ నిర్మాణాలు కూల్చకుండా స్టే విధించాలంటూ మరికొందరు హైకోర్టును ఆశ్రయిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే.. దుర్గం చెరువు ఎఫ్టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలకు హైడ్రా నోటీసులు జారీ చేయగా.. అక్కడి నివాసితులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో హైకోర్టు ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కూల్చివేతలపై హైకోర్టు స్టే విధించింది. దీంతో.. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డికి కూడా ఊరట లభించినట్టయింది. 2014లో జారీ చేసిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌పై దుర్గం చెరువు నిర్వాసితులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. తమ అభ్యంతరాలను లేక్ ప్రొటెక్షన్ కమిటీ పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ క్రమంలో అక్టోబర్ 4న లేక్ ప్రొటెక్షన్ కమిటీ ముందు దుర్గం చెరువు నిర్వాసితులు హాజరు కావాలని హైకోర్టు ఆదేశించింది. అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని అక్టోబర్ 4 నుంచి ఆరు వారాలలోపు ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయాలని లేక్ ప్రొటెక్షన్ కమిటీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

**రేవంత్ అన్నకు భారీ ఊరట..**

అయితే.. మాదాపూర్ అమర్ కోఆపరేటివ్ సొసైటీలో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఇంటికి హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చారు. తిరుపతి రెడ్డు ఇల్లుతో పాటు కార్యాలయం కూడా దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్లు అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన ఆ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించాలని స్పష్టం చేసిన రెవెన్యూ అధికారులు.. 30 రోజుల గడువు కూడా ఇవ్వటం గమనార్హం. ఈ నోటీసులపై స్పందించిన తిరుపతి రెడ్డి.. తాను ఉంటున్న ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంటే హైడ్రా ఎలాంటి చర్యలు తీసుకున్నా తనకు అభ్యంతరం లేదని తెలిపారు. కాగా.. ఇప్పుడు హైకోర్టు స్టే విధించటంతో.. తిరుపతి రెడ్డికి భారీ ఊరట లభించినట్టయింది.

# కాంగ్రెస్‌ది గుండా రాజ్యం

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఇంటికి వెళ్లిన హరీష్ రావు.. ఆమె నివాసంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. ఉద్దేశపూర్వకంగానే ఎమ్మెల్యే సునీతా రెడ్డి ఇంటి మీద కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారని అన్నారు. గోమారంలో సునీతా రెడ్డి ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను ఆరెస్ట్ చెయ్యాలని డిమాండ్ చేశారు.

దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డీజీపీకి ఫోన్ చేసి చెప్పానన్నారు. గొడవ జరుగుతున్న ఘటనను వీడియో తీస్తున్న హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వారిని కుడా తక్షణమే అరెస్ట్ చేయాలని.. లేదంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం కలిసి డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మొన్న కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి.. ఇవాళ సునీత రెడ్డి నివాసంపై దాడి జరిగిందని.. కాంగ్రెస్ గుండాల నుండి తెలంగాణ రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్రం సాధించిన పార్టీగా.. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతిననివ్వమని పునరుద్ఘాటించారు. నిన్న కౌశిక్ రెడ్డి, నేడు సునీతా రెడ్డి ఇంటిపై దాడి జరిగిందన్నారు. రాయలసీమ ఫ్యాక్షన్‌లా రేవంత్ పాలన నడుస్తోందని విమర్శలు గుప్పించారు.



# వన్ స్టేట్, వన్ డిజిటల్ కార్డ్

**మొదటిపేజీ తరువాయి**

రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.

**పథకాలన్నింటికీ ఒకటే కార్డు**

రాష్ట్రంలో వన్ స్టేట్, వన్ డిజిటల్ కార్డు విధానం అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. రేషన్, ఆరోగ్య సేవలతో పాటు సంక్షేమ పథకాలన్నీ ఒకే కార్డు ద్వారా అమలు చేసేలా ప్రణాళిక చేస్తోంది. కుటుంబ డిజిటల్ కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా సంక్షేమ పథకాలు పొందేలా ప్రణాళిక చేయాలని సీఎం సూచించారు. డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యులందరి హెల్త్ ప్రొఫైల్ పొందుపరిచి, దాని ద్వారానే ఆరోగ్య సేవలు అందించాలన్నారు. అర్హులందరికీ కుటుంబ డిజిటల్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని, జిల్లాల వారీగా ప్రత్యేక వ్యవస్థ ఉండాలని సీఎం సూచించారు. రాజస్థాన్, హర్యానా, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధానాలను అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

**రేషన్‌కార్డుల జారీపై ఫోకస్**

మరోవైపు రాష్ట్రంలో నూతన రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందుకోసం అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇక కొత్త రేషన్‌కార్డుల జారీకి మంత్రివర్గ ఉపసంఘం విధి విధానాల రూపకల్పనలో నిమగ్నమయ్యింది. ఈ క్రమంలో ఆయా కుటుంబాల వార్షిక ఆదాయ పరిమితిని కూడా నిర్ణయించనుంది.

ఇప్పుడు ఈ ఆదాయ పరిమితిని మార్చాలా, తగ్గించాలా, ఉన్నదాన్నే కొనసాగించాలా అనే విషయంపై కమిటీ కసరత్తు చేస్తోంది. దీనిపై పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ నేతృత్వంలోని పలువురు అధికారులు గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటించారు. అక్కడ అమలులో ఉన్న విధి విధానాలను అధ్యయనం చేశారు. అనంతరం మంత్రివర్గ ఉపసంఘానికి నివేదికను సమర్పించారు. ఆదాయపరిమితి ఎంతకు నిర్ణయించనున్నారనేది త్వరలో తెలియనుంది.

# సీతక్క నేను మీ ఫ్యాన్!

**మొదటిపేజీ తరువాయి**

ఒక ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. అదే సమయంలో సీఎం వద్ద ఉన్న మంత్రి సీతక్కను చూసి మహేష్ బాబు సతీమణి నమ్రత కలిశారు. సీతక్కను చూడగానే ఆమె దగ్గరకు నమ్రత వెళ్లారు. సీతక్కను అభినందిస్తూ.. మీకు ఫ్యాన్ అంటూ నమ్రత మంత్రితో ఫోటో దిగినట్లు సమాచారం. దీనికి సంబంధించిన ఫోటోలు తాజాగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. సీతక్క అంటే ఎవరికైనా అభిమానమేనని, నమ్రతను నెటిజన్లు ప్రశంసించారు.

# రేషన్ కార్డు లేని రైతులకూ రుణమాఫీ..

**మొదటిపేజీ తరువాయి**

హామీ ఇచ్చారు. ప్రీమియం ప్రభుత్వమే కడుతుందని అన్నారు. పంటల బీమా పథకం కూడా అమలు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందని విమర్శించారు. గత ఐదేళ్లు రుణమాఫీ గురించి మాట్లాడలేదని గుర్తుచేశారు. కెనాల్ మరమ్మతులు పూర్తి చేసి రేపటి నుంచి సాగునీరు అందిస్తామని అన్నారు. కాగా, సోమవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయం దిగువన నాగార్జునసాగర్ ఎడమ కాల్వ అండర్ టన్నల్ పునర్నిర్మాణం, కాల్వ గండి పూడ్చివేత పనులను మంత్రి తుమ్మల పరిశీలించారు. వరద ప్రభావంతో ధ్వంసమైన తీరును, కాలువ కట్టకు గండ్లు పడిన తీరును జల వనరులశాఖ అధికారులు మంత్రికి వివరించారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి కాల్వకు నీటిని విడుదల చేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు.

## నేషనల్ కరాటే టోర్నీలో ఉజెఫ్ షరీఫ్ కు గ్రాండ్ చాంపియన్ షిప్

- **అభినందించిన టి జి ఎమ్ ఎఫ్ సి చైర్మెన్ ఓబెదుల్ల కొత్వాల్**



**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో ఆదివారం జరిగిన నేషనల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ టోర్నమెంట్ లో కింగ్ షోటోకాన్ కరాటే డూ ఇండియా విద్యార్థి ఉజేఫ్ షరీఫ్ ప్రతిభచాటాడు. ఓపెన్ కోట విభాగంలో ఉజేఫ్ షరీఫ్ బంగారు పతకం సాధించడంతోపాటు గ్రాండ్ చాంపియన్ షిప్ సాధించాడు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్ల కొత్వాల్ సోమవారం జిల్లా కేంద్రంలో ఉజేఫ్ షరీఫ్ ను అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి కరాటే టోర్నీలో విద్యార్థి గ్రాండ్ ఛాంపియన్షిప్ సాధించడం గర్వంగా ఉందన్నారు. కింగ్ షోటోకాన్ క్లబ్ ఫౌండర్ జహంగీర్ పాషా ఖాద్రి ఆధ్వర్యంలో విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ కరాటే టోర్నీల్లో పతకాలు సాధిస్తుండడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఆయన జహంగీర్ పాషా ఖాద్రీని ప్రత్యేకంగా అభినందించారు. కింగ్ షోటోకాన్ విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కింగ్ షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫిక్ పటేల్, ప్యాట్రన్ లక్ష్మణ్, బ్లాక్ బెల్ట్ విద్యార్థి ఆర్ష్ జమీల్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





## కాంక్రీట్ మిల్లర్ ప్రమాదంలో తల్లి కూతుళ్ళు మృతి

**వారధి న్యూస్, పెబ్బేరు / శ్రీరంగాపూర్:** కాంక్రీట్ మిల్లర్ ప్రమాదంలో తల్లి కూతురు మృతి చెందగా తండ్రికి తీవ్ర గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల వెళితే మండల పరిధిలోని నాగరాల గ్రామం మొదటి సెంటర్ కు చెందిన సురేందర్ తండ్రి బిచ్చన్న భార్య స్వాతి, కూతురు అశ్వితలకు ఆనారోగ్యం కావడంతో సోమవారం శ్రీరంగాపూర్ హాస్పిటల్ కు మోటర్ సైకిల్ పై వెళ్తుండగా బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డిసిఎం వాహనం కు వెనకాల కాంక్రీట్ మిల్లర్ ను తగిలించుకోనీ వస్తుండగా శ్రీరంగాపుర్ శివార్ లో పృథ్వీరాజ్ వ్యవసాయ పొలం దగ్గర మోటర్ సైకిల్ కు తాగడంతో తల్లి స్వాతి (26), కూతురు అశ్విత (03) అక్కడికక్కడే మృతి చెందగా, సురేందర్ కు తీవ్ర గాయాలు తగలడం తో హాస్పిటల్ కు తరలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు కొత్తకోట సి ఐ రాం బాబు, ఎస్ ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. డి సి ఎం మద్యం సేవించి నిర్లక్ష్యంగా నడిపడం తొ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. బంధువుల పిర్యాదు తొ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మోటర్ సైకిల్ పై నుండి ఎగిరి పడిన సురేందర్ కుమారునికి ఎలాంటి గాయాలు తగలేదు. చిన్నంబావి ఎస్ ఐ, మాజీ జడ్పీటిసి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీటీసీ ఎల్లాస్వామి, సంఘటన స్థలాన్ని పరిశీలించారు.




## ప్రజా ప్రతినిధులను అరెస్ట్ చేస్తారా!

- **"ఇదే నా ప్రజా పాలన అంటే "**
- **పేద ప్రజల ప్రాణాలు పోతుంటే అధ్యయనం చేయాల్సిన అవసరం లేదా!**
- **ప్రజల పక్షాన పోరాడుతాం**
- **మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత**

**వారధి న్యూస్, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం లో అతి పెద్ద ఆసుపత్రి గా పేరుగాంచిన గాంధీ ఆసుపత్రిలో జరుగుతున్న మరణాల విషయం పై అధ్యయనం చేయాలని గాంధీ వైద్య కమిటీ సభ్యులతో కలిసి కేటీఆర్ సందర్శించి అక్కడి పరిస్థితుల పై అడిగి తెలుసుకోవాలా అని బయలుదేరారు. ఈ విషయం పై గ్రేటర్ హైదరాబాదులోని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులను , కార్పొరేటర్ లను ముందస్తు సమాచారం ఇవ్వకుండా పోలీసులు అరెస్టు చేయడం ఎంత వరకు న్యాయమని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించిన మెట్టుగూడా డివిజన్ కార్పొరేటర్ రాసూరి సునీత. గాంధీ ఆసుపత్రికి మేము బయలుదేరక ముందే ఇంటిలో నుంచే పోలీసులు అత్యుత్సాహంతో ప్రజా ప్రతినిధులైన మమ్ములను అరెస్టు చేసి చిలకలగూడా పోలీస్ స్టేషన్ కు తరలించడం, ఇదేనా " ప్రజా పాలన " అంటే అని ఎద్దేవా చేసిన మెట్టుగూడ డివిజన్ కార్పొరేటర్ రాచూరి సునీత . తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం పోరాటాలు, అరెస్టులు మాకేమి కొత్త కాదని ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించిన రాసరి సునీత. పేద ప్రజల జీవితాల కోసం రాజీలేని పోరాటంతో , జైలుకైనా రెడీ అని ఆమె వెల్లడించారు.

## సిగ్నల్ గడ్డ రోడ్డుకు 30 రోజుల్లో మోక్షం

- **నేషనల్ హైవే అథారిటీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి**



**వారధి న్యూస్, మహబూబ్‌నగర్:** జడ్చర్ల పట్టణం లో సిగ్నల్ గడ్డ రోడ్డు సమస్య త్వరలో పరిష్కారం కానుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. నేషనల్ హైవే నెంబర్ 167 నిర్మాణంలో రోడ్డు పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, రైల్వే శాఖ క్లియరెన్స్ లు లేటవ్వడం వంటి కారణాలతో నిలిచిపోయి, తీవ్ర అసౌకర్యం కలిగించాయి. ఈ రోడ్డు దుస్థితిని నేషనల్ హైవే అథారిటీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే, రోడ్డు నిర్మాణం 30 రోజుల్లో పూర్తి చేస్తామని హామీ పొందారు.సిగ్నల్ గడ్డ ప్రాంతంలో వర్షాల కారణంగా భారీ గుంతలు ఏర్పడడంతో ప్రజలకు రాకపోకలు కష్టతరం అవుతున్నాయి. గతంలో కూడా ప్రజలు ఫిర్యాదు చేసినప్పటికీ, ఈ సమస్యకు ఎటువంటి పరిష్కారం రాలేదని విమర్శలు ఉన్నాయి. కొత్తగా ఎన్నికైన అనిరుధ్ రెడ్డి ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని, హైవే అధికారులతో కలిసి వెంటనే చర్యలు తీసుకునేలా చేశారని తెలిపారు.హైవే అధికారులు ఈ రోడ్డులో బీటీ రోడ్డు వేయడానికి 30 రోజుల్లో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.





## విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను అలవర్చుకోవాలి

- **క్రీడలలో గెలుపు, ఓటములు సహజం**
- **రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**కొల్లాపూర్ , వారధి న్యూస్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను అలవర్చుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ ,పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మినీ స్టేడియంలో సోమవారం 68 వ ఎస్‌జీఎఫ్ఐ కొల్లాపూర్ డివిజన్ స్థాయి క్రీడలను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... క్రీడలలో గెలుపు ,ఓటములు సహజమని, గెలుపోటములను క్రీడాకారులు సానుకూల దృక్పథం తో స్వీకరించాలని ఆయన అన్నారు. విద్యార్థిని,విద్యార్థులు రాష్ట్రంలో నిర్వహించే పోటీలలో ప్రథమ స్థానంలో నిలవాలని ఆయన ఆకాక్షించారు. క్రీడలను ప్రారంభించిన అనంతరం మంత్రి జూపల్లి కొల్లాపూర్ మినీ స్టేడియంలో క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడారు.





## కార్మికుల బ్లాక్ డే

- **సిఐటియు, టిఎన్టీయూసీ ఆధ్వర్యంలో నిరసన**

**మహబూబ్‌నగర్, వారధి న్యూస్:** కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువస్తున్న చట్టాలను నిరసిస్తూ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని సిఐటియు, టిఎన్టీయూసీ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ చౌరస్తాలో బ్లాక్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, టిఎన్టీయూసీ జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.వారు మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను తప్పుపట్టారు. 8 గంటల పని సమయాన్ని 12 గంటలకు పెంచుతూ కార్మికులను బాధపడేలా చేస్తుందని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో విఫలమవుతోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు సహకరిస్తూ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందని వారు పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఈ బ్లాక్ డేను నిర్వహిస్తూ, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు చేసేందుకు సిద్ధమవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బి. చంద్రకాంత్, టౌన్ కార్యదర్శి జి. రాజ్ కుమార్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## కేజీబీవీల బోధన సిబ్బంది ఎంపికలో అభ్యంతరాలు ఉంటే తెలపండి

- **డిఇఓ గోవిందరాజులు**

**వారధి.న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** నాగర్ కర్నూల్ జిల్లాలోని 20 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని భర్తీ చేసేందుకు గత సంవత్సరం మెరిట్ జాబితా నుంచి 1:3 నిష్పత్తి ప్రకారం పిలిచి ఇటీవల నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఖాళీగా ఉన్న ఆయా సబ్జెక్టుల వారీగా 1:1 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేసి వెబ్సైట్ https://deonagarkurnool.weebly.com నందు ఉంచడం జరిగిందని ఎవరికైనా ఏమైనా అభ్యంతరాలు ఉంటే 24వ తేదీ 12 గంటలకు నాగర్ కర్నూల్ కర్నూలు డి ఈ ఓ కార్యాలయం యందు తెలపాలని జిల్లా విద్యాశాఖ అధికారి అయిన గోవిందరాజులు ప్రకటనలో తెలిపారు.



## బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బీరం

**వారధి న్యూస్, పానుగల్ :** మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు భాస్కర్ రెడ్డి గుండె పోటుతో హైదరాబాద్ మలక్ పేట్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొల్లాపూర్ మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి సోమవారం ఆసుపత్రికి వెళ్లి భాస్కర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు.



## ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

- **జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** వివిధ సమస్యలపై ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే, కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హెచ్చరించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 167 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వచ్చి అర్జీలు అందజేస్తారని, వీటిని ఆయా విభాగాల అధికారులకు వెంటనే పంపి పరిష్కార మార్గాలు చూపాలని సూచిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు వీటిని పరిశీలించాలని సూచించారు. వివిధ శాఖలకు చెందిన సమస్యలపై వచ్చిన ఫిర్యాదు ఆయా శాఖలకు పంపించి పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారానికి ఆయా శాఖలో ఉన్నతాధికారి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరిండెంట్లు చంద్రశేఖర్, యూసఫ్ అలీ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్టీఆర్ సైన్స్ కాలేజ్ విద్యార్థులు మెడికల్ ఎగ్జిబిషన్ సందర్శన

**వారధి న్యూస్, మహబూబ్‌నగర్:** స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు ఎస్వీఎస్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన మెడికల్ ఎగ్జిబిషన్ను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఈ ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థులు వైద్యరంగంలోని ఆధునిక అభివృద్ధులు, కొత్త వైద్య విధానాలను నేర్చుకునే అవకాశం పొందారని, ఇది వారి నైపుణ్యాభివృద్ధికి సహకరిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగపతి డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ శివప్రసాద్, ఎం. వెంకటరమణమూర్తి, అదిబా తాజ్, యూఎస్. సోనాలి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## కామ్రేడ్‌కు జోహార్లు

**వారధి న్యూస్, జనగామ:** సీపీఎం సీనియర్ నాయకుడు బోట్ల చిన్న శ్రీనివాస్ జనగామ పట్టణం ధర్మ కంచలో సోమవారం తెల్లవారు జామున మూడుగంటలకు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీపీఎం నాయకుడిగా విస్తృత సేవలందించిన శ్రీనివాస్ మృతిపట్ల సిపిఎం జిల్లా నాయకులు మరియు ఇతర రాజకీయ పార్టీల నేతలు విచారం వ్యక్తం చేశారు.అంతిమ యాత్ర ధర్మ కంచ నుంచి రైల్వే స్టేషన్ మీదుగా చౌరస్తా వరకు నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకులు మాట్లాడుతూ, శ్రీనివాస్ మృతి పార్టీకి తీరని లోటుగా ఉందని పేర్కొన్నారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com




## వెంకన్న ప్రసాదం లడ్డు కల్తీ కి నిరసన తెలిపిన హిందూ జాగృతం

**వారధి న్యూస్, పెబ్బేరు:** తిరుమల తిరుపతి వెంకన్న ప్రసాదం లడ్డు కల్తీ పై శుభష్ చౌరస్తాలో హిందూ జాగృతి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లడుతూ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డుకు ప్రత్యేకమైన పవిత్రత ఉందని తెలిపారు. హిందువులకు పరమ పవిత్రమైనటు వంటి లడ్డును గత ప్రభుత్వం కల్తీ నెయ్యి ద్వారా జంతువుల నుండి చేపల నుండి సేకరించిన కొవ్వును లడ్డులో వాడుతున్నారని దీనిని తీవ్రంగా హిందువులందరూ ఏకమై దీనిని పూర్తిగా ఖండించాలని అన్నారు. కల్తీ లడ్డులు తయారీ లో పాల్పడిన గత ప్రభుత్వ నాయకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దేవస్థానాల లో ఉమ్మడి కమిటీని వేయాలన్న ప్రతిపాదనను మద్దతు తెలుపుతు తెలుపుతున్నమని అన్నారు. హిందువుల మనోౌవాలను దెబ్బ తీసే విద్ధంగా చేసిన వారిని వెంకటేశ్వర స్వామి చూస్తాడని అన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను అగౌరపరిచిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రతి ఒక్కరి పై కఠినంగా శిక్షించాలని... పెబ్బేరు మండలం తరుపున... తిరుమల తిరుపతి దేవస్థానానికి మద్దతిస్తూ నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ సభ్యులు, అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి సభ్యులు, షిరిడి సాయి సేవ సమితి సభ్యులు, శ్రీ భక్తాంజనేయ స్వామి, వీరంపేట ఆంజనేయ స్వామి దేవస్థానం సభ్యులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న టీజీటీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం



**వారధి న్యూస్, పెబ్బేరు:** పెబ్బేరు తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీజీటీ (ఆంగ్లం) పోస్టును గంటల ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టి. నరేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ పోస్టుకు అర్హతగా బీఈడీ, టెట్ ఉత్తీర్ణత ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 25 వరకు పాఠశాలకు దరఖాస్తులు అందజేయాలని, మరింత సమాచారం కోసం పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు.



## మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

- **సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణ సాగర్**

**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని అని సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షులు కృష్ణ సాగర్ పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఉన్న తాళ్ళచెరువు పై వనపర్తి మున్సిపల్ శాఖ తరపున గత సంవత్సరం చెట్లు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందని వనపర్తి పట్టణానికి చెందిన గొర్ల కాపర్లు రోజువారీగా మేకలకు చెరువు కట్టపై ఉన్న చెట్లను కొట్టి మేపుతుండగా గుర్తించిన పర్యావరణ ప్రేమికుడు కృష్ణ సాగర్ చెట్ల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వారికి తెలిపి వారి చేత మొక్కలను తెప్పించి చెట్లను నరికేసిన స్థలాల్లోనే మొక్కలు నాటించడం జరిగిందని ఇలాంటి పనులు ఎక్కడ కూడా చేయొద్దని వారికి సూచించారు అనంతరం వారికి చీర్ల గోవర్ధన్ సాగర్ ,లక్ష్మణ యాదవ్ చేతుల మీదగా బాల పీర్ , లోకేష్ లను శాలువలతో సత్కరించడం జరిగిందన్నారు. గొర్ల యజమాని బాల పీర్ మాట్లాడుతూ చెట్ల వల్ల కలిగే ప్రయోజనాలు మాకు వివరించిన కృష్ణసాగర్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో చిలుక కుమార్, ఎలక్ట్రిషన్ వెంకటేష్ సాగర్, లక్ష్మణ్ యాదవ్, లోకేష్ బాలపిరు, పాల్గొన్నారు




## 500 లకే గ్యాస్ సిలిండర్ పథకం

- **లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి**

**వారధి న్యూస్, దేవరకద్ర :** మదనపురం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం లో భాగంగా 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం అమలు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల రూపాయల కవరేజ్, మరియు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను పూర్తీ చేయడం జరుగుతోందన్నారు.ఇక రైతులకు సంబంధించి, 98% రుణమాఫీ ఇప్పటికే పూర్తి చేశామని, మిగిలిన రైతులకు కూడా త్వరలో రుణమాఫీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే, రేషన్ కార్డులు అక్టోబర్ నుండి పంపిణీ చేసి, దసరా నాటికి ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు.కార్యక్రమంలో 22 మంది కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు, అలాగే రైతు బీమా మరియు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.





## ఉపధ్యాయ వృత్తి గౌరవ పరమైనది

- **లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ**

వారధి న్యూస్, నాగర్ కర్నూల్ పట్టణం లోని హిమాలయ హోటల్ నందు నాగర్ కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని క్లబ్ లో సభ్యులు గా ఉన్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మాజీ గవర్నర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రతి మనిషి యొక్క ఉజ్వల భవిష్యత్ కు పునాది ఉపాధ్యాయుడే అని, ప్రతి మనిషికి చదువే కాకుండా సంస్కారం నేర్పడం, విద్యార్థి యొక్క ఇష్టం,సామర్థ్యం గుర్తించి తను ఈ రంగంలో రాణించగలడో సూచించడం ఒక్క ఉపాధ్యాయునికే సాధ్యం అని అన్నారు. నాగర్ కర్నూల్ పట్టణం లో లయన్స్ క్లబ్ ప్రారంభించినప్పడి నుండి ప్రభుత్వ పాఠశాలకు క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, క్లబ్ అభివృద్ధికి ఉపాధ్యాయ సభ్యులు కూడా చక్కని సహకారం అందించారని వారిని అభినందించారు.కార్యక్రమం లో లయన్స్ క్లబ్ లో సభ్యులైన ఉపాధ్యాయులు దర్శి రాజయ్య, వాస రాఘవేందర్, లగిశెట్టి కోదండ రాములు, రాచూరి వెంకటరాజ, పోల శ్రీనివాసులు, దొంతు శంకర్, ప్రేమ్ కుమార్ రెడ్డి, భాగ్య లక్ష్మి, చంద్రశేఖర్ రెడ్డి మరియు జోన్ చైర్మన్ శివ శ్రీనివాస్ లను ఘనంగా సత్కరించారు.ఈ సన్మాన కార్యక్రమ అనంతరం జోన్ చైర్మన్ అధ్యక్ష్యతన అడ్వైసరీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనాగర్ కర్నూల్,అచ్చంపేట, జడ్చర్ల క్లబ్ ల యొక్క అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో క్లబ్ అధ్యక్షులు దొడ్ల రాధా రెడ్డి, ముఖ్య అతిధి రాధా కృష్ణ తో పాటు రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను,కార్యదర్శి వాస లక్ష్మి, కోశాధికారి నాగరాణి,క్లబ్ మాజీ అధ్యక్షులు హకీమ్ విశ్వ ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దొడ్ల ఈశ్వర్ రెడ్డి,దొడ్ల రాజవర్ధన్ రెడ్డి,లక్ష్మి నరసింహా గౌడు,రామకృష్ణారెడ్డి,అమరేందర్ రెడ్డి, దొడ్ల ఇందుమతి, సురేష్ కుమార్, శైలజ,లక్ష్మి,స్వరూప, సృజన లు పాల్గొన్నారు.



## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ

**వారధి న్యూస్, బిజినపల్లి :** గంగారం ప్రాథమిక పాఠశాల హరిజనవాడలో రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా 300 మంది విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జూనియర్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్, హిందీ పండితుడు కందుకూరి అశోక్ కుమార్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గంగారం కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ బాలకృష్ణ రెడ్డి, శ్రీధర్, రాజారాం, ప్రకాష్, రత్న శేఖర్, మహమ్మద్ కోములయ్య, శ్రీకాంత్, పిఎస్ హెచ్ఎం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నోటు పుస్తకాలు అందుకున్న విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## పెచ్చులు ఊడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల పైకప్పు

- **విద్యార్థుల సమస్యలపై ఫిర్యాదు**
- **బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివనాయక్**



**వారధి న్యూస్, వనపర్తి:** వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ అంశంపై బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివనాయక్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.శివనాయక్ మాట్లాడుతూ, తాగునీరు, సరైన బాత్రూంలు, మరియు స్వచ్ఛత వంటి మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మినరల్ వాటర్ మిషన్స్ ఉన్నప్పటికీ, అవి వినియోగించుకోలేని పరిస్థితుల్లో ఉన్నాయని తెలిపారు.వర్షం పడినపుడు తరగతి గదుల పైకప్పులు లీకై నీరు నేరుగా గదుల్లోకి వస్తోందని, పైకప్పు పెచ్చులు ఊడి విద్యార్థులపై పడే ప్రమాదం ఉందని, దీనిపై అధికారులు స్పందించడంలో జాప్యం చేస్తున్నారని శివనాయక్ తెలిపారు.ఇక కళాశాల పరిసరాల్లో చెత్తకుప్పలు పెరుగుతుండటంతో, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉందని ప్రభుత్వ కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్ పేర్కొన్నారు.వీటి పరిష్కారాన్ని త్వరగా అందించాలని, జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ ను కోరిన శివనాయక్, దయానంద్ ముదిరాజ్, TGVP జిల్లా అధ్యక్షులు రవి యాదవ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా వనపర్తి లో అవగాహన శిక్షణ కార్యక్రమం

**వారధి న్యూస్, వనపర్తి :** సెప్టెంబర్ 23, 2024 న వనపర్తి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో "అంతర్జాతీయ బధిరుల దినోత్సవం" అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్ ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, ప్రపంచ జనాభాలో సుమారు 9.9% మంది వినికిడి లోపంతో బాధపడుతున్నారని, వీరిలో 51.2% మంది 60 ఏళ్లకు పైబడినవారని వివరించారు. వినికిడి లోపం ఉన్న వారికి మరియు వారి కుటుంబాలకు సైన్ లెర్నింగ్ మరియు ఇతర మద్దతు సేవలను అందించడం అత్యంత అవసరమని ఆయన చెప్పారు.ఈ వారోత్సవాన్ని పాటించేందుకు, జిల్లాలో వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని, పాఠశాలలు, కళాశాలల్లో వినికిడి లోపంపై ప్రత్యేక దృష్టి పెట్టి, అవసరమైన వారికి సహాయం చేయాలని సూచించారు.అనేక సూచనలతో పాటుగా, బ్లూటూత్ ఇయర్ ప్లగ్ లేదా హెడ్‌ఫోన్ల వాడకాన్ని 50 డేసిబిల్స్ లోపు ఉంచాలని, ధ్వనిస్థాయి 100 డేసిబిల్స్ కు మించకుండా చూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఝాన్సీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు శ్రీనివాస్ కొండా, మహేశ్వర చారి, నర్సింగరావు, మరియు జిల్లా డాటా మేనేజర్ వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## తెలంగాణ కోపరేటివ్ ఎలక్షన్ అదిషనల్ రిజిస్టర్ శ్రీనివాస్ రావు కలిసిన జిల్లా చైర్మన్లు


**వారధి న్యూస్, హైదరాబాద్:** సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర అడిషనల్ రిజిస్టర్ శ్రీనివాస్ రావును వివిధ జిల్లాల చైర్మన్లు మరియు చీప్ ప్రమోటర్లు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సమావేశంలో, మత్స్య పారిశ్రామిక సహకార ప్రాథమిక సొసైటీలకు సంబంధించిన ఎలక్షన్స్ వెంటనే నిర్వహించాలనే వినతి పత్రం అందించారు.మత్స్య భవనంలో మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంక అలా గారిని కూడా కలిసిన చైర్మన్లు, రాష్ట్రంలో 6000 కి పైగా సోసైటీల గురించి సమాచారాన్ని అందించారు. 2024 సంవత్సరానికి సంబంధించిన విత్తన చేప పిల్లల విడుదలను 100% సబ్సిడీతో వేగవంతం చేయాలని కోరారు.ఇటీవల పెండింగ్‌లో ఉన్న ఇన్సూరెన్స్ వ్యవహారాలను త్వరగా పరిష్కరించాలని, బాధిత కుటుంబాలకు ఆదుకోవాలని సూచించారు. శ్రీనివాస్ రావు సానుకూలంగా స్పందించి, అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా డి ఎఫ్ సి ఎస్ చైర్మన్ వాకిటి ఆంజనేయులు, ములుగు జిల్లా చైర్మన్ రవి, హనుమకొండ చీప్ ప్రమోటర్ బుస మల్లేశం, జనగాం జిల్లా చీప్ ప్రమోటర్ నీల రాజు, వరంగల్ జిల్లా చీప్ ప్రమోటర్ సుప్పరి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- **అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశం**

**వారధి న్యూస్, వనపర్తి:** సోమవారం, ఐ.డి. ఓ.సి ప్రజావాణి హాల్లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఉమాదేవితో కలిసి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 87 ఫిర్యాదులు వచ్చినట్లు తెలియజేశారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించరాదని, వాటిని త్వరగా పరిష్కరించి ఫిర్యాదుదారునికి సమాచారం ఇవ్వాలని సూచించారు.
మహాత్మా గాంధీ కలలు కన్న పరిశుభ్రమైన భారతావని గాంధీ పోరాటంతో భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించారని, ఆయన స్వచ్ఛమైన భారత దేశం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు దేశమంతటా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ, సెల్ఫీ స్టాండ్ ప్రారంభోత్సవం జరిగినట్లు వెల్లడించారు. అదనపు కలెక్టర్ తొలి సంతకం చేసి స్వచ్ఛత హీ సేవా లో సెల్ఫీ ఫోటో దిగారు.అనంతరం, అధికారులతో కలిసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు వారంలో రెండు గంటలు, సంవత్సరానికి 100 గంటలు కేటాయించాలని ప్రతిజ్ఞ చేశారు. జిల్లా అధికారులు మరియు ఇతరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్

**వారధి న్యూస్, వనపర్తి:** సోమవారం వనపర్తి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 20 ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించారు.ఫిర్యాదుదారుల సమస్యలను విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. వారికి తక్షణ పరిష్కార కోసం, స్థానిక ఎస్ఐలు మరియు సిఐలకు ఫోన్ ద్వారా మాట్లాడారు.జిల్లా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని, మరియు పోలీస్ శాఖ ప్రజలకు మరింత దగ్గరయ్యేలా పనిచేస్తోందని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు నేరుగా స్వీకరించి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

**ఫిర్యాదుల వివరాలు:**
**భార్యాభర్తల ఫిర్యాదులు: 3**
**పరస్పర గొడవలు: 3**
**భూ తగాదాలు: 14**

ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రయత్నిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# గోమారంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి

- **తీవ్రంగా ఖండించిన మాజీ మంత్రి హరీష్ రావు**

**వారధి న్యూస్, హత్నూర:**గోమారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై ఆదివారం అర్ధరాత్రి కాంగ్రెస్ గుండాల దాడి జరిగిన ఘటనను మాజి మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. ఈ దాడి అనంతరం సోమవారం విలేకరులతో మాట్లాడిన హరీష్ రావు, రాష్ట్రంలో ప్రజాపాలన కంటే కాంగ్రెస్ గూండాల పాలన నడుస్తున్నదని విమర్శించారు. ఎమ్మెల్యేలకు రక్షణ లేకపోతే సాధారణ ప్రజలకు ఎలా కల్పిస్తారని ప్రశ్నించిన ఆయన, అర్ధరాత్రి కాంగ్రెస్ కార్యకర్తలు టపాసులు పేల్చి, ఇంట్లో ఉన్న వారిని భయభ్రాంతులకు గురి చేసినదానికి నిరసనగా మాట్లాడారు. తెలంగాణ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రల గురించి కూడా హెచ్చరించారు.హరీష్ రావు, హెడ్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్ట్ చేసి, నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, తప్పులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. లేకపోతే, డిజిపి కార్యాలయాన్ని ఎమ్మెల్యేలను తీసుకుని ముట్టడిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బిఆరెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి అండగా నిలబడ్డారు.





# అంతర్రాష్ట్ర వైరు దొంగల ముఠా అరెస్టు

**వారధి న్యూస్, భువనగిరి:**డిసిపి రాజేష్ చంద్ర తెలిపినట్లుగా, యాదాద్రి భువనగిరి పోలీసు శాఖ బొమ్మలరామారం వద్ద నిర్వహించిన పెట్రోలింగ్ లో, ఎనిమిది మంది సభ్యులతో కూడిన అంతర్రాష్ట్ర వైరు దొంగల ముఠాను అరెస్టు చేశారు. సోమవారం తెల్లవారుజామున, ఈ ముఠా ఎలక్ట్రికల్ పోల్స్ మరియు ట్రాన్స్ఫార్మర్ల నుంచి వైర్లు చోరీ చేయడం ప్రారంభించింది. పోలీసులు నిందితుల వద్ద నుంచి రూ.2,73,000 నగదు, ఒక ఎర్టిగా కారు, ఒక మారుతీ XL6, 200 కేజీల రాగి తీగ మరియు 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అందులో భాగంగా, ముఠా చోరీకి పూర్వ ప్రణాళికను అమలు చేసుకొని, దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల ముసుగులో పోలీసులకు తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే, పోలీసుల ప్రతిఘటనను ఎదుర్కొని, ముఠా సభ్యులు అరెస్టు చేయబడ్డారు.రాచకొండ పోలీస్ కమీషనర్ జి. సుధీర్ బాబు, డీసీపీ రాజేష్ చంద్ర మరియు ఇతర పోలీసు అధికారి ల మార్గదర్శకత్వంలో ఈ ఆపరేషన్ నిర్వహించబడింది.



# కల్తీ మద్యం తయారీ ముఠా గుట్టు రట్టు

- **బ్రాండెడ్ బాటిళ్లలో కల్తీ మద్యం**
- **పక్క సమాచారంతో దాడి సీఐ జగన్మోహన్ రెడ్డి**

**వారధి న్యూస్, హైదరాబాద్ :** ఎక్సైజ్ సికింద్రాబాద్ స్టేషన్ పరిధిలో అక్రమ కల్తీ మద్యం సరఫరా చేస్తున్న నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. తుది పరి విచారించగా బంజారా హిల్స్ లో నిందితులు ఖాళీ బ్రాండెడ్ మద్యం బాటిళ్ల ల ను సేకరించి వాటిలో కల్తీ మద్యం నింపి అనుమానం రాకుండా వ్యాపారం కొనసాగిస్తున్న ముఠాను వారి ప్రదేశాలపై దాడి చేసి నిందితులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామని వెల్లడించారు.




# యువత రక్తదానంలో ముందుండాలి

- **రక్తదానం గొప్పదని ఈటెల రాజేందర్ పిలుపు**

**వారధి న్యూస్, మల్కాజిగిరి:**యువత ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకోవాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ పిలుపునిచ్చారు. భారత్‌లో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జరుగుతున్న సేవమహాయజ్ఞం కార్యక్రమంలో భాగంగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బిజేవైఎం ఆధ్వర్యంలో ఓల్డ్ నేరేడ్మెట్ లోని ఎస్ఎస్ గార్డెన్ లో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించబడింది.ఈటల రాజేందర్ మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చాలా అవసరమని గుర్తు చేశారు. ఆయన రక్తదానం చేసిన వారికి శాలువా కప్పి, సర్టిఫికెట్ అందించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లారెడ్డి, బిజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, వినాయక నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, మల్కాజిగిరి అసెంబ్లీ కన్వీనర్ డి.ఎన్. వెంకటేష్, రాష్ట్ర మాజీ అధ్యక్షులు భాను ప్రకాష్, సీనియర్ నాయకులు వీకే మహేష్, మాణిక్ రెడ్డి, జగదీష్‌గౌడ్ మరియు అనేక కార్యకర్తలు పాల్గొన్నారు.



# కంచనపల్లి లో అక్రమాలను పట్టించుకోని వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్

- **డబ్బులు గోల్మాల్ చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసోక్కండి**
- **సహకార బ్యాంకుల్లో ప్రజాదనాన్ని కాపాడండి**
- **శాశ్వత కార్యదర్శి ని నియమించాలి**
- **కంచనపల్లి ప్రజలు**

**వారధి న్యూస్, జనగామ:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘములో గత కొద్ది కాలంగా భారీగా అవినీతి, ఆరోపణలు, అక్రమాలు బయట పడటం జరిగింది. సుమారుగా 50 లక్షల రూపాయలు సెంట్రల్ బ్యాంక్ నుండి విత్ డ్రా చేసినట్టు, గతంలో కూడా ఇదే అంశం పై డైరక్టర్లు ఆందోళన చేపట్టాగ, విచారణ చేపట్టిన అధికారులు అప్పుడున్న కార్యదర్శి వంగ శ్రీనివాస్ ను గతంలో సస్పెండ్ చేసారు. బ్యాంక్ నుండి డబ్బులను విత్ డ్రా చేసి దేనికోసం ఖర్చు చేశారు అంశం సంబందించిన పైల్ లో వివరణ లేదు. బ్యాంక్ లోని డబ్బు అవకతవకలపై బ్యాంక్ చైర్మన్ సీ హెచ్ రవీందర్ ను ఈ నెల 17,డీ సి వో రాజేందర్ రెడ్డి సస్పెండ్ చెయ్యడం జరిగింది. సహకార బ్యాంక్ లో ఇలాంటి అవకతవకలు జరకకుండా జి వో 44 లోని అర్హత గల ఎంప్లాయిస్ ని కంచనపల్లి సొసైటీ లో శాశ్వత కార్యదర్శి ని నియమించాలని ప్రజలు కంచన పల్లి ప్రజలు కోరుతున్నారు




# సూర్యాపేటలో షీ టీమ్ అవగాహన కార్యక్రమం

**వారధి న్యూస్, సూర్యాపేట:**ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, షీ టీమ్స్ ఎస్ఐ నీలిమ నాయకత్వంలో సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, మత్తుమందుల పై విద్యార్థినులకు అవగాహన కల్పించబడింది. నీలిమ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ కింద షీ టీమ్స్ పటిష్టంగా పనిచేస్తున్నాయని, విద్యార్థులు ఇంటర్నెట్ సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలను ఇతరులతో పంచుకోకుండా ఉండాలని, బ్లూ లింక్స్ పై క్లిక్ చేయొద్దని చెప్పారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు, వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రాణి, హెడ్ కానిస్టేబుల్ యల్లారెడ్డి, భరోసా సెంటర్ మౌనిక, మరియు విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసు కళాబృందం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం యువతను చెడు వ్యసనాల నుండి దూరంగా ఉంచేందుకు, మహిళల రక్షణపై పటిష్టంగా పనిచేసేందుకు ఉద్దేశించబడింది.



# రైతుల సంక్షేమంమే.. ప్రజా ప్రభుత్వానికి అజెండా

- **మంత్రులు పొంగులేటి, తుమ్మల**

**వారధి న్యూస్, పాలేరు:** రైతుల సంక్షేమం ప్రధాన అజెండాగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు మరియు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, రైతులకు పూర్తి పంటల బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లిస్తుందని, అక్టోబర్ 2 నుండి నూతన రేషన్ కార్డుల జారీ మరియు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభం అవుతుందని వివరించారు.తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, గతంలోనే 31 వేల కోట్ల రుణమాఫీ చేయడం ద్వారా తెలంగాణ ప్రత్యేకంగా నిలిచిందని, 2 లక్షల వరకు రుణాలున్న రైతులకు షెడ్యూల్ ప్రకటించి మాఫీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. రైతుల పంటల బీమా పథకాలను అభివృద్ధి చేసే ఉద్దేశంతో ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్నది.పాలేరు నియోజకవర్గాన్ని సాగునీరు సమృద్ధిగా ఉండే ప్రాంతంగా మార్చాలని, చెరువులను పునరుద్ధరించాలని మంత్రులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.





# ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి

- **దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ కె. నారాయణరెడ్డి ఐపీఎస్**

**వారధి న్యూస్, కొడంగల్:**ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ కె. నారాయణరెడ్డి ఐపిఎస్ సూచించారు. సోమవారం, ఆయన దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, అక్కడి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో, సిసి కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం గురించి మాట్లాడారు. ఎస్పీ, సిసి కెమెరాలు నేరస్తులను పట్టుకోవడంలో ఎంత ముఖ్యమైనవో తెలియజేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన పిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందరికీ సానుకూల సేవలు అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు.అతను 5ఎస్, ఫంక్షనల్ వర్టికల్, కమ్యూనిటి పోలిసింగ్ వంటి అంశాలను ప్రాధాన్యం ఇవ్వాలని మరియు ఆన్లైన్ ఫైల్స్ పెండింగ్‌లో ఉండకుండా వాటిని త్వరగా పూర్తి చేయాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. డైల్ 100 పై వచ్చే పిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేయకూడదని జోడించారు.ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మల్లాపూర్ లో చెప్పుల డబ్బా కూల్చివేత..?

- **కెసిఆర్ అన్నా ఎక్కడ ఉన్నావు ! నువ్వు రావాలి**
- **మమ్ములను చంపేయండి అంటూ రోదనలు**
- **చెప్పుల దుకాణం వ్యక్తి**

**వారధి న్యూస్, హైదరాబాద్ :** మల్లాపూర్ నోమ ఫంక్షన్ హాల్ ముందు ఉన్న చెప్పుల దుకాణం కూల్చేందుకు జెసిబి తో హైడ్రాధికారులు వచ్చారు. దీంతో బాధితుల తల్లి,కొడుకులు మా డబ్బా ను కూల్చవద్దు అని అధికారులను మొరపెట్టుకున్నారు. పేద వాళ్లము మాకు జీవనాధారం పోతే, ఎలా బ్రతకాలి అని రోదించారు . ఇది కూల్చేముందు నన్ను నా కొడుకుని చంపేయండి అంటూ జెసిబికి అడ్డుపడుతూ రోదించిన తల్లి . కెసిఆర్ అన్న ఎక్కడున్నావ్ ..! నీవు రావాలి అంటూ తల్లి కొడుకు అర్ధనాదాలు మిన్నంటాయి. రేవంత్ రెడ్డిని తరలికొట్టాలి మీరు అంటూ చెప్పుల దుకాణం వ్యక్తి పెద్ద పెద్ద కేకలు వేస్తూ రోధించాడు .



# యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ను కలిసిన గ్రేటర్ మేయర్, కార్పొరేటర్లు

**వారధి న్యూస్, హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి,కార్పొరేటర్ల బృందం యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లను ఆయనకు మేయర్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసిలో బెస్ట్ ప్రాక్టీసెస్, శానిటేషన్ ,పచ్చదనం, సి ఆర్ ఎం పి, హెచ్.టి.సి పథకాలు సీఎం యోగి ఆదిత్యనాథ్ కు వివరించారు.

# గ్యాస్ సబ్సిడీకి మా లక్ష్మి పత్రం తప్పనిసరి

- **ఏ ఎస్ ఓ అధికారి విజయ**

**వారధి న్యూస్, హైదరాబాద్ :** వంట గ్యాస్ సబ్సిడీ పొందుతున్న వారు దగ్గర్లోని పౌరాసరపర శాఖ అధికారి కార్యాలయం , రేషన్ దుకాణంలో ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ పత్రాన్ని తీసుకోవాలని సికింద్రాబాద్ సర్కిల్ 9 ఏఎస్ఓ విజయ తెలిపారు . ఈ మేరకు ఆమె లబ్ధిదారులకు మహాలక్ష్మి పాత్రాన్ని అందజేశారు. ఈనెల 9 నుంచి ప్రారంభమై 25 వరకు ఉంటుందని ఆమె తెలిపారు. సబ్సిడీ రానివారు ఈ పత్రాన్ని డిస్ట్రిబ్యూటర్లకు అందజేయాలన్నారు.

# రేషనలైజేషన్ జి.ఓ.25 నిబంధనలను మార్చాలి

- **టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల యాదయ్య**



**వారధి న్యూస్, బీబీనగర్:** ఉపాధ్యాయుల నియామకాలలో అశాస్త్రీయమైన జీవో నెంబరు 25 నిబంధనలను మార్పు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల యాదయ్య అన్నారు. బీబీనగర్ మండలంలో సభ్యత్వ నమోదుకు విచ్చేసిన ఆయన, ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించడం అన్యాయమని తెలిపారు.ఇటీవల జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలలో పాఠశాల విద్యా శాఖ పాటించిన నిబంధనలను అమలు చేయకపోవడం పట్ల టీఎస్ యూటీఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి ప్రాథమిక పాఠశాలలో 40 మందికి ఇద్దరు, 60 మందికి ముగ్గురు, ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుని కేటాయించాలని ఆయన కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకి ప్రధానోపాధ్యాయుడిని నియమించి, ఉపాధ్యాయులను భోదనేతర పనుల నుంచి పూర్తిగా మినహాయించాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్. సుదర్మా రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బి. నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు వి. రమేష్, యశోధర, సి. హెచ్. ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- **ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్**

**వారధి న్యూస్, రాజేంద్రనగర్:** పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత సేవ, పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. మన ఇంటి ఆవరణతో పాటు చుట్టుపక్కల శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు.అదేవిధంగా, స్వచ్ఛదనం పాటిస్తూ వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నార్సింగ్ మున్సిపల్ చైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వారధి న్యూస్, వికారాబాద్:** జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా, జిల్లా పరిధిలోని దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా, వీటిని వెంటనే పరిష్కరించాల్సిన అవసరం గురించి వ్యాఖ్యానించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో, అదనపు కలెక్టర్ సుధీర్ మరియు ఆర్డిఓ వాసు చంద్ర లతో కలిసి ప్రజల నుండి 179 ఫిర్యాదులను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని చెప్పారు. రైతు రుణమాఫీ, భూమి సమస్యలు ప్రధానంగా వస్తున్నందున, మండల స్థాయిలో వీటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

రుణమాఫీపై వస్తున్న ఫిర్యాదుల పట్ల, వ్యవసాయ అధికారులు కారణాలను అర్థం చేసుకొని సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్, ఆర్డిఓ వాసు చంద్ర, జిల్లా అధికారులు మరియు ఇతర సంబంధిత వ్యక్తులు పాల్గొన్నారు.



# మిర్చి పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు కోసం కలెక్టర్‌కు వినతి

**వారధి న్యూస్, ములుగు:**ఏటూరునాగారం కేంద్రంగా మిర్చి పారిశ్రామిక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని, ఇది రైతులకు విలువ జోడించడం మరియు స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు ఉపకరిస్తుందని ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకరను జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ సభ్యుడు మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు నాసిరెడ్డి సాంబశివరెడ్డి కోరారు.సోమవారం, ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన ఆయన, సుగంధ పుస్తకాన్ని బహుకరించారు. అనంతరం, ములుగు జిల్లాలో మిర్చి పంటను వేలాది ఎకరాల్లో సాగిస్తున్నారని, ముఖ్యంగా ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం మరియు వాజేడు వెంకటాపురం మండలాల్లో విస్తారంగా సాగుతున్నాయని వివరించారు.మరుమూల మండలాల నుంచి మిర్చిని వరంగల్‌కు తరలించడంలో రవాణా ఖర్చులు రైతులపై అధిక బారం పడుతున్నాయి. అందువల్ల, ఎండుమిర్చి నిల్వ కోసం కనీసం ఐదు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న శీతల గిడ్డంగి నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు.మిర్చి పారిశ్రామిక మరియు ప్రాసెసింగ్ క్లస్టర్ ఏర్పాటు ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, అలాగే ఎండు మిర్చి రైతులకు అదనపు ఆదాయం అందించగలిగే విధానాలు ఉన్నాయని చెప్పారు.

ఏటూరునాగారంలో మిర్చి ప్రాసెసింగ్ మరియు పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు, అలాగే వరంగల్ చపట మిర్చికి అంతర్జాతీయ జీఐ గుర్తింపు పొందడానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ కృషి చేస్తున్నారని వివరించారు.ఈ అంశంపై స్పందించిన జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర, సమస్యను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో షేక్ మోయినుద్దిన్, కటుకూరి సాంబశివరావు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలంటూ డిమాండ్

- **సీఐటీయూ బ్లాక్ డే**

**వారధి న్యూస్, మిర్యాలగూడ:**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్ మరియు జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం, సీఐటీయూ ఆధ్వర్యంలో బ్లాక్ డే సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కొత్త చట్టాల ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ, "హక్కుల సాధన కోసం కార్మికుల సంఘాలు ఏర్పాటు చేసుకుంటున్నాయని, కానీ కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలతో కార్మికుల ఐక్యతను దెబ్బతీస్తున్నది" అని విమర్శించారు. ఆయన కార్మికులు తమ పనికి తగ్గ వేతనం పొందేందుకు పోరాటం చేస్తారని, కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని ఆరోపించారు. అనంతరం, ఆయన నాలుగు కొత్త చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి, సీఐటీయూ నాయకులు మంద రాజు, గోవర్ధన్ రెడ్డి, సోములు, క్రాంతి, సతీష్, గౌస్, అజిమ్, వెంకన్న, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.




# మోదీకి 56 అంగుళాల ఛాతీ ఇప్పుడు లేదు

- **మన్ కీ బాత్ కాదు, కామ్ కీ బాత్ సంగతేంటి?**
- **ప్రధానిపై రాహుల్ గాంధీ విమర్శలు**

**వారధి న్యూస్, శ్రీనగర్:**

గతంలో ప్రధాని నరేంద్ర మోదీకి ఉన్న 56 అంగుళాల ఛాతీ ఇప్పుడు లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మన్‌కీ బాత్ గురించి మాట్లాడే ప్రధాని, కామ్ కీ బాత్ (పని) గురించి ఎప్పుడు మాట్లాడతారని ప్రశ్నించారు. 25మంది వ్యాపారవేత్తల కోసం రూ.16లక్షల కోట్లు మాఫీ చేశారని ఆరోపించారు. జమ్ముకశ్మీర్‌లో లెఫ్టినెంట్ గవర్నరే రాజు అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆయన జమ్ముకశ్మీర్ వ్యక్తి కాదని, ఔట్‌సైడర్ అని చెప్పారు. ఇక్కడి ప్రజలు కోరుకునే అభివృద్ధిని ఆయన చేయలేదని, ఇక్కడి పరిస్థితుల గురించి గవర్నర్‌కు ఏం తెలియదని అన్నారు. మోదీ ప్రభుత్వం జమ్ముకశ్మీర్ ప్రజల హక్కులను హరించిందని ధ్వజమెత్తారు. పూంఛ్ జిల్లాలోని సూరన్‌కొటె, శ్రీనగర్ జిల్లాలోని జైన్‌కొటెలో సోమవారం జరిగిన ఎన్నికల సభల్లో రాహుల్ మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.



**'అన్యాయంగా యూటీ చేశారు'**


భారత్‌లో కేంద్ర పాలిత ప్రాంతాలు (యూటీ) రాష్ట్రాలుగా మారాయని తెలిపారు రాహుల్. మధ్యప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్, బిహార్ నుంచి ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ ఏర్పాటు అయ్యాయని అన్నారు. అయితే, భారతదేశ చరిత్రలో ఒక రాష్ట్రాన్ని యూటీ చేయడం జరగలేదన్నారు. కానీ మొట్టమొదటి సారి ఓ రాష్ట్ర ప్రజల హక్కులను హరించి యూటీ చేశారని మండిపడ్డారు. జమ్ముకశ్మీర్ ప్రజలు అన్యాయానికి గురయ్యారని చెప్పారు.

**'పార్లమెంట్ జమ్ముకశ్మీర్ ప్రజల వాయిస్ వినిపిస్తా'**

పార్లమెంట్‌లో జమ్ముకశ్మీర్ ప్రజల వాణి వినిపిస్తానని, రాష్ట్ర హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామని రాహుల్ అన్నారు. అవసరముంటే, ఆర్డర్ వేయగానే ప్రత్యక్షమవుతానని అన్నారు. "రాష్ట్ర హోదా పునరుద్ధరించడం ఇక్కడి ప్రజలకు అదిపెద్ద సమస్య. బీజేపీ చేయకున్నా(ఎన్నికల తర్వాత) ఆ పని మేము చేస్తామని గ్యారెంటీ ఇస్తున్నా. దేశవ్యాప్తంగా బీజేపీ హెచ్ఎమ్‌టీ వంటి అనేక కంపెనీలను మూసేసింది. సామాన్యులను పట్టించుకోకుండా, 25మంది వ్యాపారవేత్తలకు, రూ. 16లక్షల కోట్లు మాఫీ చేసింది. కానీ పేదలు, రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలకు చేయలేదు. తప్పుల తడకగా ఉన్న జీఎస్‌టీతో అనేక, చిన్న మధ్యతరగతి పరిశ్రమలు మూతపడటానికి కారణమైంది. ఫలితంగా ఇక్కడి వారితో సహా యువతకు ఉద్యోగాలు లేకుండా పోయాయి. ఇది నరేంద్ర మోదీ గిఫ్ట్. ప్రధాని, మన్‌కీ బాత్‌లో అర్థం లేని సుదీర్ఘ ప్రసంగాలు ఇస్తారు, కానీ ప్రజల సమస్యలు పట్టించుకోరు. కామ్ కీ బాత్ మాట్లాడరు. ఇకపై ఎవరూ మోదీ మన్‌కీ బాత్ వినరు." అని రాహుల్ అన్నారు.

# చైల్డ్ పోర్నోగ్రఫీ చూస్తే జైలుకే..

- **సుప్రీంకోర్టు సంచలన తీర్పు**
- **మద్రాసు హైకోర్టు తీర్పు కొట్టివేత**
- **చట్టసరవణ చేయాలని పార్లమెంట్‌కు సూచన**
- **వ్యక్తిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ పునరుద్ధరణ..**




**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**

చైల్డ్ పోర్నోగ్రఫీపై సుప్రీంకోర్టు కీలక తీర్పును వెల్లడించింది. ఇటీవల మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తోసిపుచ్చుతూ.. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం, డౌన్‌లోడ్ చేయడం పోక్సో ప్రకారం నేరమేనని స్పష్టం చేసింది. చైల్డ్ పోర్నోగ్రఫీ చూడడం నేరం కాదని మద్రాస్ హైకోర్టు తీర్పునివ్వగా.. ఈ తీర్పును కొట్టేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా చైల్డ్ పోర్నోగ్రఫీ షేర్ చేయకుండా డౌన్‌లోడ్ చేయడం, వీక్షించడం నేరం కాదన్న మద్రాస్ హైకోర్టు తీర్పును ఓ వ్యక్తి సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. చైల్డ్ పోర్నోగ్రఫీని డౌన్‌లోడ్ చేయడం, చూడటం పోక్సో, ఐటీ చట్టాల ప్రకారం నేరమని పేర్కొంది. చైల్డ్ పోర్నోగ్రఫీ పదంపై చట్టసవరణ చేయాలని పార్లమెంట్‌కు సూచించింది.

**హైకోర్టు ఘోర తప్పిదం చేసిందన్న సుప్రీంకోర్టు..**

చైల్డ్ పోర్నోగ్రఫీని డౌన్‌లోడ్ చేయడం, చూడటం పోక్సో చట్టం ప్రకారం నేరం కాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సీజే జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. తీర్పు ఇవ్వడంలో హైకోర్టు ఘోర తప్పిదం చేసిందని పేర్కొంది. చైల్డ్ పోర్నోగ్రఫీ అనే పదాన్ని ఉపయోగించవద్దని అన్ని కోర్టులను ఆదేశించింది. చైల్డ్ పోర్నోగ్రఫీని 'పిల్లల లైంగిక వేధింపులు, దోపిడీ అంశాలు'గా పేర్కొనవచ్చని తెలిపింది.

**క్రిమినల్ ప్రొసీడింగ్స్ పునరుద్ధరణ..**

తన ఫోన్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీని డౌన్‌లోడ్ చేశాడని 28 ఏళ్ల యువకుడిపై అభియోగాలు మోపిన కేసులో ఇటీవల మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వ్యక్తిపై ఉన్న క్రిమినల్ ప్రొసీడింగ్‌లను కోర్టు రద్దు చేసింది. ప్రస్తుతం చైల్డ్ పోర్నోగ్రఫీ చూడటం అనే తీవ్రమైన సమస్యతో పోరాడుతున్నారని.. అలాంటి వారిని శిక్షించే బదులు వారికి మంచి బుద్ధులు నేర్పించేలా సమాజం పరిణితి చెందాలని మద్రాసు హైకోర్టు తీర్పు సందర్భంగా వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలను తప్పుబట్టిన సుప్రీం కోర్టు.. ఆ వ్యక్తిపై క్రిమినల్ ప్రొసీడింగ్‌లను పునరుద్ధరించింది.

పిల్లలకు సంబంధించిన ఏదైనా అశ్లీలంగా ఉన్న ఫొటో, వీడియోలను డౌన్‌లోడ్ చేస్తే రూ.5 వేల వరకు జరిమానా విధించవచ్చు. మళ్లీ అదేతప్పు చేస్తే.. 10 వేల రూపాయలకు తక్కువ కాకుండా జరిమానా పడుతుంది. వ్యాపారం కోసం పిల్లల అశ్లీల వీడియోలు సేవ్ చేసి పెట్టుకుంటే.. 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుంది. తదుపరి నేరారోపణలో ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష వరకు ఉంటుంది.

# ఆస్కార్ బరిలో.. లాపతా లేడీస్..

- **అధికారికంగా ప్రకటించిన కేంద్రం**
- **ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో సందడి చేసిన మూవీ**
- **అమీర్‌ఖాన్ హీరోగా మార్చి 1న విడుదలై రికార్డు**
- **ప్రశంసలు అందుకుంటున్న డైరెక్టర్ కిరణ్ రావు**
- **నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో సినిమా చూడొచ్చు..**

**వారధి, స్టేట్ బ్యూరో:**

బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్ ఖాన్ భార్య కిరణ్ రావు తెరకెక్కించిన లాపతా లేడీస్ 97వ ఆస్కార్ పోటీలకు అధికారికంగా ఎంపికైంది. హీరో అమీర్‌ఖాన్ నిర్మించిన ఈ చిత్రం ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ ఏడాది మార్చి 1న విడుదలైన ఈ సినిమాలో స్పర్ష్ శ్రీవాస్తవ్, నితాన్షి గోయల్, ప్రతిభా రంతా, రవి కిషన్ ప్రధాన పాత్రలు పోషించారు. మహిళా సాధికారతకు సంబంధించిన కథతో ఎంతో ఆసక్తికరంగా లాపతా లేడీస్ సినిమాను తెరకెక్కించారు కిరణ్ రావు. ఈ సినిమాకు ఆస్కార్ దక్కాలనేది కిరణ్ రావు కల. ఇప్పుడామె కల నిజమైంది. లాపతా లేడీస్ చిత్రం ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో ఎంపికైంది. ఈ విషయాన్ని భారత్ ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు చెన్నైలో ప్రకటించారు. లాపతా లేడీస్ సినిమా 2001లో గ్రామీణ భారతం నేపథ్యంలో సాగుతుంది. అమీర్ ఖాన్ నిర్మించిన లాపతా లేడీస్ గతంలో టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. ఆస్కార్ పోటీకి ఎంపిక కావడంపై లపాతా లేడీస్ దర్శకురాలు కిరణ్‌రావు ఫస్ట్ రియాక్షన్ ఇచ్చింది. ఆమె దర్శకత్వం వహించిన రెండో చిత్రం లాపతా లేడీస్. అంతకు ముందు గోబీ ఘాట్ చిత్రానికి దర్శకత్వం వహించారు. లాపతా లేడీస్ సినిమా హిట్టయ్యిందని ప్రేక్షకులే కాదు పలువురు సినీ ప్రముఖులు సైతం అంటున్నారు. ఇప్పుడు ఆస్కార్‌కి ఎంపిక కావడంతో చిత్ర బృందం చాలా సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా కిరణ్‌రావు పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.



మా సినిమా ఆస్కార్ పోటీకి ఎంపిక కావడం టీమ్ మొత్తం కృషికి, అభిరుచికి నిదర్శనం. సినిమా ఎప్పుడూ హృదయాలను కరిగించే, అర్థవంతమైన కమ్యూనికేషన్‌ని సృష్టించే, సరిహద్దులను అధిగమించే మాధ్యమం. భారతీయులకు నచ్చిన విధంగానే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుందని నమ్ముతున్నాను. లాపతా లేడీస్ సినిమాపై నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరికీ, సెలక్షన్ కమిటీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ ఏడాది ఎన్నో ఉత్తమ చిత్రాలలో మా చిత్రం ఎంపిక కావడం గర్వించదగ్గ విషయం. మాకు సపోర్ట్ చేస్తున్న అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్ మరియు జియో స్టూడియోస్‌కి ధన్యవాదాలు. టాలెంటెడ్ టెక్నీషియన్స్‌తో పనిచేసినందుకు గర్వంగా ఉంది. అలాగే ఈ సినిమా నిర్మాణానికి సహకరించిన ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ టీమ్ అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అది మరిచిపోలేని ప్రయాణం అని కిరణ్ రావు అన్నారు. అలాగే సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఈ సూపర్ హిట్ సినిమా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో అందుబాటులో ఉంది.



# హెచ్‌సీఏలో భారీ దోపిడీ..

**కాంట్రాక్ట్ వ్యవహారాలపై విచారణ జరిపించండి**
**విజిలెన్స్ డీజీకి ఎంపీ చామల లేఖ**

**వారధి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో కాంట్రాక్ట్ వ్యవహారాలపై విచారణ జరిపించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు విజిలెన్స్ అదనపు డీజీకి ఆయన లేఖ రాశారు. హెచ్‌సీఏలో టెండర్ ప్రక్రియ, రవాణా సేవలు సహా ఇతర కాంట్రాక్టు వ్యవహారాలపై దర్యాప్తు జరపాలని ఆ లేఖలో పేర్కొన్నారు.క్యాటరింగ్, రవాణా సేవల కోసం టెండర్ ప్రక్రియపై యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. ఇది అసోసియేషన్ పనితీరును ప్రభావితం చేస్తుందన్నారు. అపెక్స్ కౌన్సిల్‌తో సరైన సంప్రదింపులు లేకుండా ముందుకు వెళుతున్నారని, నిర్ణయాధికారాలు కొంతమంది వ్యక్తుల చేతుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. టెండర్ లేకుండానే ఐపీఎల్ కాంట్రాక్టులు ఇవ్వడం వంటి నిర్ణయాలు హెచ్‌సీఏ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com


Movie Time మూవీ టైమ్

# ఘరందంలో శోభిత...



తెలుగు అమ్మాయి శోభితా ధూళిపాళ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎంత మంది తెలుగు హీరోయిన్లు ఉన్నా శోభిత మాత్రం టాలీవుడ్ ని దాటి బాలీవుడ్ కి దూసుకెళ్లిన నటి. ట్రెండ్ కి తగ్గట్టు తనని తాను మౌల్డ్ చేసుకుంటూ నార్త్ బ్యూటీలకు ఏమాత్రం తక్కువ కాదని ప్రూవ్ చేస్తుంది. ఆ రకంగా ట్రెండ్ ని ఫాలో అవుతుంది కాబట్టే ఆ రేంజ్ లో ఫాలోయింగ్ దక్కించుకుంది. అందుకే ఇప్పుడు అక్కినేని నాగచైతన్యని ప్రేమ వివాహం చేసుకుంటుంది. శోభిత పుట్టింది తెనాలి అయినా! పెరిగింది అంతా విశాఖ పట్టణంలోనే. చిన్ననాటి నుంచి నార్త్ కల్చర్ కి అలవాటు పడిన బ్యూటీ. మోడ్రన్ కల్చర్ లోనే ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఆమె ఆలంకరణ..దుస్తులు ఎంపిక ప్రతీది నార్త్ బ్యూటీని తలపిస్తుంది. తెలుగు సంప్రదాయంలో కనిపించడం అన్నది చాలా రేర్. వీలైనంత వరకూ ఆల్ట్రా మోడ్రన్ దుస్తుల్లో కనిపించడానికే ఎక్కువగా ఇష్టపడుతుంది. మరి ఇది చైతన్య తెచ్చిన మార్పా? తనలో కలిగిన మార్పా? అన్నది తెలియదు గానీ.. తాజాగా శోభిత సంప్రదాయ చీరందంలో తళుక్కున మెరిసింది. ఇదిగో ఇక్కడిలా క్రీమ్ సారీ మ్యాచింగ్ బ్లౌజ్ లో ఎంతో అందంగా కనిపిస్తుంది. డిజైనర్ చెవులీలు...చేతికి ఎంపిక చేసుకున్న మ్యాచింగ్ యాక్సరసీస్...మ్యాకప్ ఇతర అలంకరణ ప్రీతీది శోభితని ఎంతో అందంగా తీర్చి దిద్దాయి. నుదిటిన ఎరుపు వర్ణం చిన్న బొట్టు మరింత ఆకర్షణీయంగా ఉంది. అన్నీక్లోజప్ షాట్స్ లోనూ వివిధ భంగిమల్లో శోభిత ఎంతో అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక శోభిక కెరీర్ గురించి చెప్పాల్సిన పనిలేదు. క్రేజీ ప్రాజెక్ట్ ల్లో అవకాశాలు అందుకుంటుంది.

# 2025, మార్చి 28న భారీస్థాయిలో 'హరి హర వీర మల్లు'



సినీ రంగంలో తిరుగులేని కథానాయకుడిగా పేరు సంపాదించుకున్న పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, రాజకీయ రంగంలోనూ అదే స్థాయిలో రాణిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్, ప్రజాసేవలో పూర్తిగా నిమగ్నమై ఉన్నారు. దీంతో సినిమాలకు ఆయన సమయం కేటాయించలేకపోతున్నారు. పవన్ కళ్యాణ్ ను మళ్ళీ వెండితెరపై చూసుకొని, థియేటర్లలో అసలుసిసలైన పండగ వాతావరణాన్ని తీసుకురావాలని.. అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు అభిమానుల ఎదురుచూపులు ఫలించబోతున్నాయి. వారి సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలుకుతూ, ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' 2025, మార్చి 28వ తేదీన భారీస్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. 'హరి హర వీర మల్లు' చిత్రంలో పవన్ కళ్యాణ్ మొదటిసారి చారిత్రాత్మక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత, ఈ సినిమా యొక్క మిగిలిన చిత్రీకరణను పూర్తి చేయడానికి పవన్ కళ్యాణ్ రంగంలోకి దిగారు. చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరూ ఆయన విలువైన సమయాన్ని వృథా చేయకుండా పక్కా ప్రణాళికతో చిత్రీకరణకు ఏర్పాట్లు చేశారు. విరామం తరువాత కూడా యోధుడి పాత్రకు తగ్గట్టుగా పవన్ కళ్యాణ్ తన రూపాన్ని మలచుకొని అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఆయన రూపం, ఆహార్యం చూసేందుకు రెండు కళ్ళు సరిపోవు. పవన్ కళ్యాణ్ రాకతో చిత్ర బృందం రెట్టింపు ఉత్సాహంతో భారీ యుద్ధ సన్నివేశ చిత్రీకరణను ప్రారంభించింది. 'హరి హర వీర మల్లు' సినిమా కొత్త షెడ్యూల్ సెప్టెంబర్ 23న విజయవాడలో ప్రారంభమైంది. హాలీవుడ్ దిగ్గజ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ ఆధ్వర్యంలో భారీ యుద్ధ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. దిగ్గజ కళా దర్శకుడు తోట తరణి ఆధ్వర్యంలో చిత్ర బృందం భారీ సెట్‌ను నిర్మించింది. ఈ భారీ యుద్ధ సన్నివేశాలను.. 400 మంది ఫైటర్లతో పాటు, భారీ సంఖ్యలో జూనియర్ ఆర్టిస్టులతో చిత్రీకరిస్తున్నారు. బాలీవుడ్ సంచలనం, 'యానిమల్' ఫేమ్ బాబీ డియోల్, దిగ్గజ నటుడు అనుపమ్ ఖేర్ ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. అందాల నటి నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు.

# సందీప్ కిషన్ 'మజాకా' ఫస్ట్ లుక్ లాంచ్



పీపుల్స్ స్టార్ సందీప్ కిషన్ ల్యాండ్‌మార్క్ 30వ సినిమాకి ధమాకా మేకర్ త్రినాధరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్నారు. మాస్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ బ్యానర్స్ పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తాసహ నిర్మాత. ఈ హెల్తీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, రిలీజ్ టైం రివిల్ చేయడం ద్వారా మేకర్స్ ప్రమోషన్‌లను ప్రారంభించారు. #SK30కి 'మజాకా' అనే టైటిల్ పెట్టారు, టైటిల్ ఎంటర్టైన్మెంట్ ఎక్స్ పీరియన్స్ అందిస్తుంది. ఫస్ట్ లుక్ పోస్టర్ లో సందీప్ కిషన్ పర్ఫెక్ట్ సంక్రాంతి బుల్లోడుగా కనిపించారు. సంప్రదాయ పట్టు పంచె, చొక్కా ధరించి, తన భుజంపై పెద్ద టేప్ రికార్డర్‌తో కుర్చీపై కూర్చుని కనిపించారు. సంక్రాంతి పండగని తలపించిన ఈ ఫస్ట్ లుక్ అదిరిపోయింది. కలర్‌ఫుల్‌గా వున్న ఫస్ట్ లుక్ ప్లజెంట్ ఎక్స్ పీరియన్స్ ని అందిస్తుంది. ఈ మూవీలో రావు రమేష్ కీలక పాత్రలో కనిపించనున్నారు, నిర్మాతలు అనౌన్స్ చేసినట్లు, ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. మాస్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా విడుదలకు సంక్రాంతి పర్ఫెక్ట్ సీజన్.